# ఆళ్వార్లసంగ్రహచరిత్ర

రచన

వైద్యం వేంకటేశ్వరాచార్యులు

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2018

# ALWARLA SANGRAHA CHARITHRA

*by*

**VAIDYAM VENKATESWARACHARYULU**

T.T.D. Religious Publications Series No. 1354
© All Rights Reserved

*First Print :* 2018

*Copies :* 500

*Published by*
**SRI ANIL KUMAR SINGHAL,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

***D.T.P:***
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

భారతదేశం పుణ్యభూమి, కర్మభూమి. ఈదేశంలో ఎందరో మహాపురుషులు అవతరించారు. ఆమహాపురుషులు వారి వారి కాలాల్లోని వివిధ పరిస్థితుల్లో మనుగడ సాగిస్తూ మానవసమాజోద్ధరణకు కృషిచేశారు. తద్వారా ప్రజల్లో సామాజికచైతన్యంతోపాటు ఆధ్యాత్మికవికాసాన్ని కల్పించారు.

మహాత్ములజీవితగాథలను, వారు ప్రబోధించిన జీవనసత్యాలను, ఆధ్యాత్మికసందేశాలను భక్తులకు అందించాలన్న తలంపుతో తిరుమల తిరుపతి దేవస్థానం **'బ్రహ్మ మొక్కటే'** అనే శీర్షిక క్రింద ఒకగ్రంథమాలను ప్రారంభించింది. అందులో భాగమే ప్రస్తుతగ్రంథం **ఆళ్వారుల సంగ్రహచరిత్ర.**

శ్రీవైష్ణవసంప్రదాయంలో ఆళ్వారులకు ఒకవిశిష్టస్థానం ఉన్నది. ఆళ్వారులు అంటే జ్ఞానసముద్రమున మునిగి లేచినవారని అర్థం. మహాజ్ఞానులైన ఆళ్వారులు శ్రీవైష్ణవమతానికి మూలస్తంభాలవంటివారు. వీరిసూక్తులు మోక్షసాధానికి నిచ్చెనలు. ఈఆళ్వారులు 12 మంది. వీరినే పన్నిద్దరాళ్వారులంటారు.

ఆళ్వారులు ఆధ్యాత్మిక ప్రేమానంద భక్తిప్రవాహ స్వరూపులుగా కీర్తింపబడ్డారు. అంతరశుద్ధి, శీలం, భగవదనుగ్రహప్రాప్తికి మూలమని ఆళ్వారుల నిశ్చితాభిప్రాయం. అందువల్లనే వర్ణాశ్రమవిభేదాలు పాటించక భగవద్‌జ్ఞానాన్ని అందరికీ స్వేచ్ఛగా అందజేశారు. అందువల్ల హిందూమతానికి పునఃప్రతిష్ఠ జరిగినట్లైంది.

ఈపన్నిద్దరాళ్వారులు వేరు వేరు కులాల్లో వేరు వేరు కాలాల్లో పుట్టినా కూడా భగవత్ ప్రావణ్యం వీరందరకూ సమానమే. ఇంతటిమహనీయుల పుణ్యచరితుల జీవితవిశేషాలను ప్రసిద్ధ వైష్ణవపండితులు, సాహితీ పరిశోధకులు అయిన శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు గారిచేత గ్రంథస్థం చేయించి బ్రహ్మొక్కటే శీర్షిక క్రింద 'ఆళ్వారులసంగ్రహచరిత్ర' అనే పేరుతో భక్తకోటికి టి.టి.డి. అందిస్తున్నది. ఈగ్రంథాన్ని భక్తమహాశయులు ఆదరిస్తారని ఆశిస్తూ....

*సదా శ్రీవారి సేవలో....*



**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# విషయ సూచిక


I ముందుమాట...... (కార్యనిర్వహణాధికారి)

II విన్నపం....

III ప్రస్తావన............

1 ఆళ్వారుల అవతరణం....

2. పన్నిద్దరాళ్వారులు

.1 పొయ్గై ఆళ్వారు (సరోయోగి ...)

.2 పూదత్తాళ్వారు (భూతయోగి...)

.3 పేయాళ్వారు (మహాయోగి...)

.4 తిరుమళిశైఆళ్వారు (భక్తిసారయోగి...)

.5 కులశేఖరాళ్వారు.

.6 పెరియాళ్వారు (విష్ణు చిత్తులు...)

.7 ఆండాళ్ (గోదాదేవి...)

.8 తొండరడిప్పొడియాళ్వారు (విప్రనారాయణులు...)

.9 తిరుప్పాణాళ్వారు (శ్రీ పాణయోగి)

.10 తిరుమంగై ఆళ్వారు (పరకాలయోగి)

.11 నమ్మాళ్వారు (శఠకోప యోగి)

.12 మధురకవి ఆళ్వారు


**అనుబంధం**


1. ఆళ్వారుల తిరునక్షత్ర తనియన్లు – ధ్యానశ్లోకాలు...

2. పన్నిద్దరాళ్వారులు – సంక్షిప్త పరిచయ సూచిక

3. పన్నిద్దరాళ్వారులు అనుగ్రహించిన దివ్యప్రబంధాలు (పాశుర సంఖ్యా సమేతం)

# విన్నపం

**ఆధారగ్రంథాలు**

ఆళ్వారుల వరుసక్రమం చెప్పడంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఎవరి అభిప్రాయాలు వారివి, ప్రస్తుత రచనలో మాత్రం ఆచార్య సూక్తి ముక్తావళిలో చెప్పిన క్రమాన్ని అనుసరించాను. నా రచనకు ఈ క్రింది గ్రంథాలు ఉపయుక్తాలు. వాటి కర్తలకు కృతజ్ఞతలు, నమోవాకములు.

1. దివ్యసూరి చరిత్రమ్ –
   గరుడవాహన పండిత శ్రీనివాసాచార్య కృతం – సంస్కృతం
2. ప్రపన్నామృతమ్ –
   అనంతాచార్య కృతం సంస్కృతం
3. ఆచార్య సూక్తి ముక్తావళి –
   నంబూరు కేశవాచార్య కృతం – తెలుగు
4. భార్గవ పురాణము –
   బహిరీ పామనాయక కృతం – తెలుగు
5. వ్యాసవైజయంతిక
   (1) (2) భాగాలు – వైద్యం వేంకటేశ్వరాచార్య కృతం – తెలుగు వ్యాసాలు
6. 108 దివ్యదేశ ప్పాశుర కుఱిప్పు
7. తిరువేంగడముడయాన్ల విషయముగ
   శ్రీదివ్యసూరులు ఆనతిచ్చిన మంగళాశాసన పాశురములు.

**– వైద్యం వేంకటేశ్వరాచార్యులు, కర్నూలు.**

# ప్రస్తావన

వైదికధర్మశాఖలలో శ్రీవైష్ణవం ఒకటి. శ్రీవైష్ణవంలో ఆళ్వారులదీ ఆచార్యులదీ ఒక విశిష్ట స్థానం. ఆళ్వార్ అనే ద్రావిడ (తమిళ) శబ్దానికి జ్ఞాన సముద్రాన మునిగి లేచిన వాడని కొందరు పెద్దలు అర్థం చెప్పారు. Alwar means one who has taken a deep plunge in to the ocean of divine consciousness అని Alwar Saints అనే రచనలో ఉంది. మహాజ్ఞానులైన ఆళ్వారులు శ్రీవైష్ణవ మతానికి మూలస్తంభాలు. మోక్ష సౌధానికి వీరి సూక్తులు నిశ్రేణులు (నిచ్చెనలు). భక్తి ప్రపత్తులు వీరి ప్రధాన లక్షణం. శ్రీమన్నారాయణుడే పరతత్త్వం అని నమ్మి మహావైరాగ్యంతో జీవితాలను గడిపిన మహానుభావులు ఆళ్వారులు. దక్షిణభారత దేశంలో వైష్ణవానికి బీజావాపం చేసి శ్రీమన్నారాయణ పారమ్యాన్ని ముక్తకంఠంతో చాటినవారు ఆళ్వారులు.

ఉత్తరభారతంనుంచి చార్వాకాది పాషండమతవాయువులు వీచాయి. దక్షిణాపథంలో దైవభక్తి సన్నగిల్లి, ఆ క్రమంలో లోకంలో తమకు తామే గొప్పవాళ్ళమనుకొని అధః పతనానికి గురై, నిరంతర దుర్విషయ సుఖలోలురై చాలా అనర్థాలకు దారితీసింది. అలాంటి ఆపత్సమయంలో అవతరించి భక్తి సుధాప్రవాహాలతో లోకాన్ని ఉద్ధరించిన భగవంతుని దూతలు ఆళ్వారులు. ఆళ్వారుల సర్వస్వం కూడా శ్రీమన్నారాయణుడే. వారి మనస్సు భగవంతుని భజించింది. జిహ్వ నారాయణుని కీర్తించింది. కనులు కమలాక్షుని కాంచాయి. కర్ణాలు కమలనాథుని కథలు విన్నాయి. చేతులు శ్రీహరిని అర్చించాయి. పాదాలు పెరుమాళ్ళగుడికి ప్రదక్షిణంచేశాయి. సర్వం ఆదేవదేవుడే అనే అధ్యవసాయంతో ఉండిన పూర్ణయోగులు ఆళ్వారులు.

An Alwar is a living Gita – భగవద్గీతాస్వరూపులే ఆళ్వారులు.

An Alwar is on breathing upanishad –ఉజ్జీవించిన ఉపనిషన్మూర్తులు ఆళ్వారులు.

An Alwar is a golden river of love –జల జల పారే ఆధ్యాత్మిక ప్రేమానంద భక్తి ప్రవాహాలస్వరూపులు ఆళ్వారులు.

వేయి మాటలెందుకు They are moving Temples. నడయాడే పవిత్ర దేవాలయాలు ఆళ్వారులు.

ఆళ్వారులు మొత్తం పన్నెండుగురు. "గురుపరంపర"లో వీరికి ఒక క్రమం ఏర్పాటు చేయబడింది. ఈ పన్నిద్దరు ఆళ్వారులలోనూ కొందరు ద్వాపరయుగంలో ఉన్నట్లు, మరి కొందరు కలియుగం ప్రారంభంలో ఉన్నట్లు "గురుపరంపరాది" గ్రంథాలు పేర్కొంటున్నాయి. అయితే ఆళ్వారులు అంత ప్రాచీనులు కాదనీ క్రీ.శ. ఆరవ శతాబ్దం నుంచి తొమ్మిదవ శతాబ్దం లోపల ఉంటారని (భండార్కర్‌లాంటి) చరిత్రకారుల అభిప్రాయం. అయితే ఈ వాదం సరికాదనీ ఆళ్వారులు క్రీ.శ. రెండవ శతాబ్దం మొదలు ఎనిమిదవ శతాబ్దం వరకు ఉన్న మధ్యకాలం వారనీ సుప్రసిద్ధ చారిత్రకులు డా. యస్. కృష్ణస్వామి అయ్యంగార్ పేర్కొన్నారు.

మహనీయులయిన ఆళ్వారులు భక్తిపారవశ్యంతో గానంచేసిన పాశురాలు తమిళవాఙ్మయానికి భూషణాలు. ఆళ్వారులు భగవంతునిపై పాడిన పాటలే పాశురాలనీ, వాటి సంచయానికి దివ్యప్రబంధాలనీ వ్యవహారం. ఈ దివ్యప్రబంధాలన్నీ శ్రీమద్రామానుజులవారికి పూర్వమే శ్రీమన్నాథమును లను వారిచే ఒక్కచోట సంకలనం చేయబడ్డాయి. అది మొత్తం నాలుగువేల పాశురాల గొప్ప సంపుటం. అది నాలాయిర దివ్యప్రబంధంగా వేదస్థానీయంగా మన్నించబడుతోంది. శ్రీవైష్ణవలోకం పరమపవిత్రాలయిన దివ్యప్రబంధాలను అత్యంతభక్తితో పఠిస్తారు. ద్రావిడవేదం, సంస్కృతవేదం అనే రెండు వేదాలనూ ప్రమాణంగా స్వీకరించి ప్రవర్తించడంవల్ల శ్రీవైష్ణవులకు ఉభయవేదాంత ప్రవర్తకులు అనే పేరు కలిగింది.

విశిష్టాద్వైతమతవిశ్వాసాలకు బహుళవ్యాప్తిని కల్పించిన ఆళ్వారులందరూ శ్రీమన్నారాయణుని పరివార అంశసంభూతులుగా పరిగణింపబడినారు. వీరి జీవిత పరమావధి ఎక్కడో పరలోకంలో ప్రాప్తమయ్యే



ముక్తి కాదు. అది ఇప్పుడే ఇక్కడే సంప్రాప్తమయ్యే భగవత్కైంకర్య రూపమయిన భక్తి. జీవితంలో మానవుని ఏకైకకర్తవ్యం భగవత్ప్రేమకు పాత్రం కావడం. ఈఉత్కృష్టభావాలను ప్రబోధించినవారు పన్నిద్దరాళ్వారులు.

పన్నిద్దరాళ్వారులందరు కూడా భగవదర్చావిగ్రహసౌందర్య రసపానమత్తులు. భగవంతుని అప్రాకృత దివ్యసౌందర్యాన్ని సాక్షాత్కరింపజేసుకోవడంలో వీరికి కలిగిన ఆనందాన్ని ఇతరులకు సంక్రమింపజేయడం వీరి ముఖ్యలక్ష్యం, వీరంతా పరబ్రహ్మానుభవంలో ఆరితేరినవారు. పరబ్రహ్మమందు తమ ఉనికియే బ్రహ్మయొక్క అస్తిత్వానికి రుజువు అని వీరంటారు. ఆంతరశుద్ధి, శీలం భగవదనుగ్రహ ప్రాప్తికి మూలమని ఆళ్వారుల నిశ్చితాభిప్రాయం. అందువల్లనే వర్ణాశ్రమవిభేదాలు పాటించక భగవద్‌జ్ఞానాన్ని అందరకూ స్వేచ్ఛగా అందజేశారు. ఆకారణాన హిందూమతానికి పునఃప్రతిష్ఠ జరిగినట్లయింది. వీరు వేరువేరు కులాలలో వేర్వేరు కాలాల్లో పుట్టినా కూడా భగవత్ ప్రావణ్యం వీరందరకూ సమానమే.

ఇంతటి మహత్తరపునీతచరిత్రులు కావడంవల్ల ఆళ్వారులను పవిత్ర భగవదాలయాల సన్నిధులలో ప్రతిష్ఠించి అర్చిస్తున్నాం.

ఆళ్వారు శబ్దానికి యోగి, పరమయోగి, సూరి, దివ్యసూరి మొదలయినవి పర్యాయపదాలు.

ఇతః పూర్వం ఆళ్వారులను గురించి చెప్పిన అనేకగ్రంథాలలో వారి వరుసక్రమంలో భేదాలు ఉన్నాయి. దానికి ఎవరి ఆధారాలు వారివి. నేను 'ఆచార్యసూక్తి ముక్తావళి'ని అనుసరించి చెప్పాను.

ఈ రచన సంగ్రహంగా ఉంటుందని గ్రంథం పేరే తెలియజేస్తోంది. కనుక ఆళ్వారులకు సంబంధించిన అనేకవిషయాలు అతిసంగ్రహంగా, కొన్నిచోట్ల నామమాత్రంగా మాత్రమే వ్రాయవలసివచ్చింది. చివరలో అనుబంధం చేర్చబడింది.

ఈ 'ఆళ్వారుల సంగ్రహచరిత్ర' తిరుమల తిరుపతి దేవస్థానం వారి ప్రచురణగా వెలువడడం మహద్భాగ్యంగా భావిస్తున్నాను.

కర్నూలు భాగవతచరణదాసుడు
తేది 28-6-2018 వైద్యమ్‌వేంకటేశ్వరాచార్యులు

**ఆళ్వార్ దివ్య తిరువడిగళే శరణం**

# ఆళ్వారుల అవతరణం

**-పన్నిద్దరాళ్వారుల ప్రస్తుతి-**

**మ. అతిగాఢం బిల నాస్తికాంతరమతం బాకార మొక్కంటc ద**
**ధ్గతి వారింపcగ రా దటంచు, మదిలోc దర్కించి, తానే తదా**
**కృతులం దాల్చెను ద్వాదశాత్మకుc దనన్ శ్రీమత్ప్రభన్ మించు ది**
**వ్యతనూధారుల సూరులం గొలిచెదన్ బన్నిద్దరాళ్వారులన్.**

భావం– భూలోకంలో 'పలురకాలయిన నాస్తికమతాల దుర్భావాలు' అనే అంధకారంతో మూగింది. 'ఆ చీకటిని నేనొక్కడుగా తొలగించ లేనని బాగా ఆలోచించి ద్వాదశాత్మకుడైన సూర్యభగవానుడు, తన పన్నెండు మూర్తులూ పన్నిద్దరు (12) ఆళ్వారుల రూపాలుగ ధరించి వచ్చాడా అనే విధంగా వెలుగొందే – సూరులు అయిన పన్నిద్దరు ఆళ్వారులనూ కొలుస్తాను.

అది శ్రీమన్నారాయణుని మహాసభామంటపం. శ్రీస్వామివారు శ్రీ భూనీళాది దేవీ పరివృతుడై అనంతభోగి సింహాసనంపై వేంచేసి ఉంటారు. సకల దివ్య భూషణ విభూషితుడై దివ్యమంగళ విగ్రహ విశిష్టుడై స్వామివారు మహదానందకరంగా ఒప్పారుతుంటారు. గరుడ విష్వక్సేనాదులు దివ్యాయుధాలయిన పాంచజన్య సుదర్శన కౌమోదకీ శార్ఙ్గనందకాదులూ తమతమస్థానాలలో అలంకృతులై స్వామివారిసేవలో ఉంటారు. దివ్యమహాసభ నిర్వహించబడుతోంది.

శ్రీమన్నారాయణుడు చింతాక్రాంతుడై ఉంటాడు. "భూలోకవాసులు సరైన ధర్మమార్గంలో ప్రవర్తించడం లేదు, వేదశాస్త్రాలకూ విపరీతఅర్థాలు చెప్తూ, అధోగతిపాలు అవుతున్నారు" అంటూ సన్నిధిలో కొలువై ఉన్నవారిని చూస్తూ "మీరంతా భూలోకంలో ద్రవిడదేశాన అవతరించండి, సర్వచేతనోద్ధరణ చేయండి" అన్నాడు. శ్రీస్వామివారి ఆదేశానుసారం – 1 పాంచజన్యం అంశతో పొయ్‌గై ఆళ్వారు / సరోయోగి, 2. కౌమోదకి అంశతో పూదత్తాళ్వారు / భూతయోగి, 3. నందకాంశంతో పేయాళ్వారు / మహాయోగి,

4. సుదర్శనాంశతో తిరుమళిశై ఆళ్వారు / భక్తిసారయోగి, 5. కౌస్తుభాంశంతో కులశేఖరాళ్వారు, 6. గరుడాంశతో పెరియాళ్వారు / విష్ణుచిత్తులు, 7. భూదేవిఅంశతో ఆండాళ్ / గోదాదేవి, 8. వైజయంతీవనమాలాంశంతో తొండరడిప్పొడి ఆళ్వారులు / విప్రనారాయణుడు, 9. శ్రీవత్సాంశంతో తిరుప్పాణాళ్వారులు / శ్రీపాణయోగి, 10. శార్జ్గధనువు అంశతో తిరుమంగై ఆళ్వారు / పరకాలయోగి, 11. విష్వక్సేనాంశంతో నమ్మాళ్వారు / శఠకోపయోగి, 12. కుముదగణాంశంతో మధురకవి ఆళ్వారు వివిధకాలాలలో ద్రవిడభూభాగంలోను, కులశేఖరాళ్వారు / మళయాళ దేశంలోను అవతరిస్తారు.

హిమాలయాలలో శివపార్వతుల కల్యాణ సందర్భంగా అగస్త్య మహర్షికి విశ్వకర్మకు జరిగిన వాదన కారణంగా లోక కల్యాణంకోసం అగస్త్యుడు ద్రవిడభూమికి వచ్చి అక్కడే నివాసంగా ఉంటాడు. అగస్త్యుల వారు సృష్టించింది ద్రవిడభాష.

ఆళ్వారులు ద్రవిడభాషలో దివ్యప్రబంధాలు రచిస్తారు. ఆ దివ్య ప్రబంధాలు ద్రవిడవేదంగా ప్రాశస్త్యప్రాచుర్యాలను పొంది, వాటిని పారాయణం చేసిన చేతనులను సముద్ధరించగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి.

ఇలా ద్రవిడదేశాన (కులశేఖరులు మాత్రం మళయాళదేశాన) అవతరించి, వారు చెప్పిన ద్రవిడవేదం చేతనులను సముద్ధరించడంలో సముచితస్థానం కలిగి ఉంటుంది.

శ్రీమన్నారాయణుడు లక్ష్మీదేవికి ఆళ్వారుల అవతరణను గురించి ద్రావిడవేద ఆవిర్భావ ఆవశ్యకతను గురించి తత్పూర్వమే విశదీకరించి ఉంటాడు.

ఇక పన్నిద్దరు ఆళ్వారులను గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాం.



## -పన్నిద్దరాళ్వారుల ప్రస్తుతి-

**మ.** **అల పన్నిద్దరు సూరులందును సముద్యల్లీలఁ గాపున్నవె**
**గ్గలపుందాపముఁ బాప నా నిజమనఃకంజాతసంజాతపు**
**ష్కలమాధ్వీకఝురి న్మురారి సొగియంగాఁ జొక్కి ధన్యాత్ములౌ**
**నిల పన్నిద్దరు సూరులం దలఁతు మోక్షేచ్ఛామతిం దివ్యులన్.**

భావం– ఆకాశంలో పన్నెండుమంది సూర్యులు (ద్వాదశాదిత్యులు) ఉన్నారు. నేలమీద కూడా పన్నెండుమంది సూరులు (ఆళ్వారులు) ఉన్నారు. ఇద్దరిలోనూ నారాయణుడు ఉన్నాడు. సూర్యబింబాలలో ఉండడంవల్ల నారాయణునికి తాపం కలిగింది. ఆతాపం పోగొట్టుకోవడానికో అన్నట్లు నేలపై ఉన్న పన్నిద్దరు ఆళ్వారుల హృదయాలలో నిత్యం స్రవించే భక్తి అనే తేనెవాకలో మునుగడానికా అన్నట్లు నారాయణుడు నివాసం చేస్తున్నాడు. ఆస్వామిని దర్శించి ఆనందపరవశులై ఉన్న ఆళ్వారులను ముముక్షువునై నేను స్మరిస్తున్నాను.

**ఆళ్వార్ దివ్యతిరువడిగళే శరణం**



# పన్నిద్దరాళ్వారులు

**మొదలాళ్వారులు :**

1. పొయ్‌గై ఆళ్వారు, 2. పూదత్తాళ్వారు, 3. పేయాళ్వారు ఈ ముగ్గురూ పన్నెండుమంది ఆళ్వారులలో మొదటి వారు, సమకాలీనులు, ఒకే సంవత్సరంలో పుట్టినవారు. వీరుముగ్గురినీ మొదలాళ్వారులు, ముదలాళ్వారులు, యోగిత్రయం అని వ్యవహరిస్తారు. వీరు ముగ్గురుకూడా పల్లవరాజ్యంలో తొండమండలంగా వ్యవహరించబడేచోట - కాంచీపురం దాని సమీపప్రదేశాలలో జన్మించారు.

**1) పొయ్‌గై ఆళ్వారు (సరోయోగి)**

**ముకుందస్య ముఖోల్లాస**
**మూలవాగ్జాలమూర్ఛితమ్,**
**మునిముఖ్యం సరోజాతం**
**ముక్తిమూల ముపాస్మహే.**

భావం– శ్రీమన్నారాయణునికి ప్రతికరాలయిన స్తోత్రపరంపరలతో ఉన్మత్తులైన వారూ, మునులలో శ్రేష్ఠుడూ, ముక్తిప్రదాతా అయిన కాసారయోగిని ధ్యానిస్తున్నాను.

**సంజీవనత్వాత్ బహుసత్త్వయోగాత్**
**సంసారదావాగ్నివినాశకత్వాత్,**
**శైత్యోదయాత్ సూక్త్యమృతప్రవాహాత్**
**సరోభిధానం య ముదారహన్తి.**

భావం– సకల ప్రాణులనూ జీవింపజేయడంవల్ల, మిక్కిలి సత్వగుణ సంపన్నుడు అవడంవల్ల, సంసారమనే కార్చిచ్చును ఉపశమింప జేసే వారు అవడంవల్ల, అమృతంవంటి శ్రీసూక్తులు కలిగినవారవడంవల్ల వీరిని కాసారయోగి అంటారు.

శ్రీహరి పాంచజన్యశంఖాంశంతో పొయ్‌గై ఆళ్వారు జన్మించాడు. కాంచీపురంలో యథోక్తకారి సన్నిధి ఉంది. దీనికి ఉత్తరాన పసిడి పద్మాలు



ప్రకాశించే దివ్యసరోవరం ఉంది. పొయ్‌గై ఆళ్వారు అక్కడి కాంచనపద్మం నుండి అవతరించారు.

సిద్ధార్థి నామసంవత్సరం, తులామాసం సౌర కార్తిక (చాంద్ర ఆశ్వయుజ శుక్లపక్షం) అష్టమీ తిథి, మంగళవారం, శ్రవణా నక్షత్రాన వీరు జన్మించారు. పొయ్‌గై అంటే సరస్సు అని అర్థం. కనుక వీరికి సరోయోగి, కాసారయోగి అని వ్యవహారం. వీరు జ్ఞానముద్ర కలవారు, జ్ఞానానికీ భక్తికీ జలధివంటివారు. చేతనులకు పరమహితాన్ని చేసేవారు. విష్వక్సేనులవారు వీరికి పంచసంస్కారాలు చేసిన ఆచార్యులవారు. వీరు రచించిన దివ్య ప్రబంధం పేరు మొదల్ (ముదల్) తిరువందాది. ఇది 100 పాశురాలు కలిగిన ప్రబంధం.

పొయ్‌గై ఆళ్వారు మొదల్ తిరువన్దాది (ఇయఱ్పా)లో మంగళాశాసనం చేసిన దివ్యతిరుపతులు ఆరు. ఆవివరాలు - 1. తిరువరంగం, 2. తిరుక్కోవలూర్, 3. తిరువెఃకా, / యథోక్తకారి సన్నిధి 4. తిరువెంగడం, 5. తిరుప్పార్‌కడల్, 6.పరమపదం.

శ్రీమన్నారాయణుడు నిఖిలలోకాలలోని ప్రాణులను సంరక్షించడానికి శ్రీవేంకటాచలంలో నిలిచి ఉండే విగ్రహంగా వేంచేసి ఉన్నాడు. అక్కడకు వెళ్లి వేంకటాధిపుని సేవించే భాగ్యం లేకున్నా ఆ పెరుమాళ్లను ధ్యానించిన మాత్రాననే నిఖిల ప్రాణులకు దుఃఖాలన్నీ తొలగిపోతాయి, అని పొయ్‌గై ఆళ్వారులు తిరుమలలో వేంచేసి ఉన్న స్వామివారిని మంగళాశాసనం చేయడం స్మరణీయం.

**2) పూదత్తాళ్వారు (భూతయోగి)**

**భూతం నమామి యో విష్ణోః జ్ఞానదీప మకల్పయత్,**
**వందే భూతాఖ్యయోగీంద్రం వరేణ్యగుణసంపదమ్.**

భావం– శ్రీమన్నారాయణుని మంగళాశాసనం చేయడానికి జ్ఞానాన్నే దీపంగా చేసినట్టి, శ్రేష్ఠగుణయుక్తులయిన భూతాఖ్యయోగీంద్రులకు నమస్కారం.

శ్రీహరి కౌమోదకి గదాంశాన పూదత్తాళ్వారు జన్మించారు. వీరు మొదల్ ఆళ్వారులలో రెండవవారు. పొయ్గై ఆళ్వారు పుట్టిన మరునాడే వీరు మహాబలిపురంలో అవతరించారు. ద్రావిడ భాషలో మహాబలి పురాన్ని తిరుక్కడల్‌మల్లై అంటారు. ఇది బంగాళాఖాతసముద్రతీరాన ఉంది. పూదత్తాళ్వారు మాధవీ కుసుమం (బండిగురువింద పువ్వు) నుండి పుట్టారు.

సిద్ధార్థి నామసంవత్సరం చాంద్రమాన ఆశ్వయుజం శుక్ల పక్ష నవమీ తిథి ధనిష్ఠా నక్షత్రంరోజున వీరు అవతరించారు. విష్వక్సేనుల వారు వీరికి ఆచార్యులు.

పూతం అంటే యథార్థం, పవిత్రం, ఆత్మ అని అర్థం, వీరు జ్ఞానాధి కులయిన సర్వేశ్వరునికి ఆత్మగా విరాజిల్లారు. అందువల్ల పూదత్తాళ్వారుగా ప్రసిద్ధిపొందారు. వీరు బ్రహ్మముద్ర కలవారు. వీరు రచించిన దివ్యప్రబంధం "ఇరణ్డామ్ తిరువందాది". ఇందులో నూరు పాశురాలు ఉన్నాయి.

పూదత్తాళ్వారు అనుగ్రహించిన 'ఇరన్దాం తిరువన్దాది' దివ్య ప్రబంధంలో మంగళాశాసనం చేసిన తివ్యతిరుపతులు 13. ఆ వివరాలు సంక్షిప్తంగా - 1. తిరువరంగం, 2. తంజమామణిక్కోయిల్, 3. తిరుక్కుడన్దై, 4. తిరుమాలిరుంజోలై, 5. తిరుక్కోట్టియూర్, 6. తిరుత్తణ్‌గాల్, 7. తిరుక్కోవలూర్, 8. తిరుక్కచ్చి, 9. తిరుప్పాడగం, 10. తిరునీర్‌మలై, 11. తిరుక్కడల్ మల్లై, 12. తిరుమల, 13. తిరుపార్‌కడల్.

పూదత్తాళ్వారు తిరుమలవేంకటేశుని 11 పాశురాలలో మంగళాశాసనం చేస్తూ ఒక పాశురంలో ఇలా చెప్పారు- పరమపదంలో నిత్యసూరులచే నిత్యం స్తుతించబడే పరవాసుదేవుడు- త్రేతాయుగంలో శ్రీరామచంద్ర మూర్తిగా అవతరించి, సాధుజనాలను కాపాడడానికై రావణాసురుణ్ణి సంహరించాడు. ఆ పరాత్పరుడే కలియుగాన నిఖిల ప్రాణులను కాపాడడం కోసం, చాలా ఎత్తైన ఎదురు పొదలు కలిగి చల్లగా ఉండే చరియలతో గూడి పరమభోగ్యమైన శ్రీవేంకటాచలంలో విజయం చేసి ఉన్నారు.



### 3) పేయాళ్వారు (మహాయోగి)

**పద్మారమణపాదాబ్జ**
**ప్రేమభ్రాంత్యా మనోజ్ఞయా,**
**భ్రాంతయోగీతి విఖ్యాతం**
**మునిం వందే గుణాంబుధిమ్.**

భావం- శ్రియఃపతిపాదారవిందాలమీద ఉండే ప్రీతివల్ల కలిగిన భ్రాంతిచే భ్రాంతయోగి అనే వినుతిని గడించిన సుగుణఖని అయిన పేయాళ్వార్లకు నమస్కరిస్తున్నాను.

శ్రీహరి నందకఖడ్గాంశాన పేయాళ్వారు అవతరించారు. మొదలాళ్వారులలో వీరు మూడవవారు. పూదత్తాళ్వారు పుట్టిన మరునాడే వీరూ పుట్టారు. వీరు (నేటి చెన్నైలోని మైలాపూర్) మయూరనగరంలో మణికైరవం అనే బావిలోని ఎర్రకలువల నుండి అవతరించారు. సిద్ధార్థి నామసంవత్సర చాంద్రమాన ఆశ్వయుజ శుక్లపక్ష దశమి శతభిషానక్షత్రాన వీరు అవతరించారు. 'పేయ్' అంటే పిచ్చి, భ్రాంతి అని అర్థం, భగవంతుని యందే మనస్సు కలిగి పేయ్ / పిచ్చిగా తిరుగుతూ ఉండడంచేత వీరు పేయాళ్వారుగా ప్రాచుర్యం పొందారు. వీరు రచించిన దివ్యప్రబంధంపేరు "మూన్దాం తిరువన్దాది". ఇందులో నూరు పాశురాలు ఉన్నాయి.

పేయాళ్వారు అనుగ్రహించిన 'మూన్దాం తిరువన్దాది' దివ్యప్రబంధంలో మంగళాశాసనం చేసిన దివ్యతిరుపతులు 15. ఆ వివరాలు సంక్షిప్తంగా - 1. తిరువరంగం 2. తిరుక్కుడన్దై 3. తిరువిణ్ణగరం 4. తిరుక్కోట్టియూర్, 5. తిరుక్కచ్చి, 6. అష్టభుజం, 7. వేళుక్కై, 9. తిరుఊరగం, 10. తిరువెహకా, 11. తిరువెల్లిక్కేణి, 12. తిరుఘటికై, 13. తిరువెంగడం, 14. తిరుప్పార్‌కడల్, 15. పరమపదం.

తిరుమలలో వేంచేసి ఉన్న వరాహస్వామివారిని పేయాళ్వారు 10 పాశురాలలో మంగళాశాసనం చేశారు. అందులో మచ్చునకు ఒక పాశురభావం–

మదపుటేనుగులు – అనురూపంగా ఉండే ఆడ ఏనుగులతో సంశ్లేషించి, ప్రణయ కలహంతో అటు ఇటు తిరుగుతుంటాయి. స్వచ్ఛమైన రాళ్లలో తమ ప్రతిబింబాలను చూసి వేరే ఏనుగులని భావిస్తుంటాయి కొన్ని ఏనుగులు. వాటి దంతాలలోని ముత్యాలు వేంకటాద్రిపై రాలిపడుతుంటాయి. ఆశ్రీవేంకటాచలమే పూర్వం తనకొమ్ములతో జలార్ణవంనుంచి భూమిని ఉద్ధరించిన శ్రీవరాహస్వామి వేంచేసి ఉండేదివ్యపర్వతం.

పన్నిద్దరు ఆళ్వారులలో మొదట అవతరించిన ఈముగ్గురు ఆళ్వారులను యోగిత్రయం అని, మొదలాళ్వారులు అని వ్యవహరిస్తారు.

వీరు ముగ్గురూ భగవదనుగ్రహప్రాప్త దివ్య జ్ఞాన సంపన్నులు. మొదట వీరు ఒకరి నొకరు ఎరుగరు. వీరు ఒకే చోట ఉండక, పగలు సంచారం చేస్తూ రాత్రులలో మాత్రమే గ్రామాలలో ఉండేవారు. ఒక రాత్రి వీరుముగ్గురూ తిరుక్కోవలూరు (దేహళీ నగరం) అనే గ్రామంలో కలుసుకుంటారు. ఆ సంగతి సంక్షిప్తంగా–

సరోయోగి (పొయ్‌గై ఆళ్వార్) గ్రామసంచారం చేస్తూ ఒకనాడు రాత్రి తిరుక్కోవలూరు చేరుకున్నాడు. రాత్రివేళ కనుక విశ్రాంతికోసం ఒక ఇంటిబయట అరుగుమీద పడుకున్నారు. ఆస్థలం ఒకరికి మాత్రమే సరిపడేటంత ఉంది.

కొంతసేపటికి భూతయోగి (పూదత్తాళ్వారు) అక్కడకు వచ్చారు. ఇరువురు పరస్పరం దాస్యధర్మాలను నిర్వర్తించారు. భూతయోగి, సరోయోగిని "ఇక్కడ దాసునికి చోటు ఉంటుందా" అని అడిగారు. అప్పుడు సరోయోగి ఇలా చెప్పాడు – "ఒక్కరికి పడుకునేంత మాత్రమే చోటు ఉంది. కూర్చుంటే



మన ఇద్దరికీ ఈ స్థలం సరిపోతుంది, రండి" అని పూదత్తాళ్వారును ఆహ్వానించి ఇద్దరూ ఆ రాత్రి కూర్చునే ఉన్నారు.

కొంత సమయం గడిచింది. మరొక వ్యక్తి మహాయోగి (పేయాళ్వార్) అక్కడకు వచ్చారు. అక్కడ ఉన్న ఇరువురూ వచ్చినవారు విష్ణుదాసులని తెలుసుకుని మహాయోగిని పూజించారు. ఇక్కడ మనం ముగ్గురమూ కూర్చొనేందుకు స్థలం చాలదు. కనుక ముగ్గురమూ నిలుచునే భగవద్గుణానందాన్ని పొందుదాం, అని ముగ్గురు నిలిచారు.

తిరుక్కోవలూరు ఆలయంలో ఉన్న పెరుమాళ్లు ఈముగ్గురినీ పరీక్షించాలని అనుకున్నాడు. వెంటనే తాను నాలుగవ వ్యక్తిగా మారి, వారి మధ్యకు వచ్చి హరిగానం చేశాడు. ఆ కొత్త వ్యక్తి ఎవరని తెలుసుకోవడానికి ఆరాటపడుతూ భగవంతుని కీర్తించ సాగారు. అపార కరుణామయుడయిన శ్రీమన్నారాయణుడు తన అప్రాకృత దివ్యమంగళమూర్తితో ముగ్గురికీ దర్శనమిచ్చాడు. ఆ ముగ్గురూ దేవదేవునికి ప్రణతులుచేసి వేదాంత సూక్తులతో కవితావైభవంతో పెరుమాళ్లను సన్నుతించారు.

నాలాయిర దివ్య ప్రబంధాలకు నాందీవాక్యాలుగ కవితాదీపాలను వెలిగించారు. ఇవి మామూలు దీపాలు కాదు. వారి దివ్య ప్రబంధాలతో రచించిన ఆధ్యాత్మిక దివ్యజ్యోతులు.

మొదటి పొయ్‌గై ఆళ్వారు వెలిగించిన కవితాదీపం ఇలా భావకిరణాలను వెదజల్లుతోంది. ఆ భావం – "భూమిని ప్రమిదగా చేసి, సముద్రజలాన్ని నేయిగా అందులో ఉంచి, ఉష్ణ కిరణుడైన సూర్యుడిని వత్తిగా చేసి, తయారు చేసినదీపంతో స్వామివారిని అర్చిస్తాను. సుదర్శన చక్రపాణి అయిన శ్రీమన్నారాయణుని పాదకమలాలదగ్గర ఈవాఙ్మాలను భక్తితో సమర్పించడం తప్ప నేనేమి చేయగలను."

ఇక రెండవవారయిన పూదత్తాళ్వారు ఇలా కవితాజ్యోతిని వెలిగించారు–

"భక్తిని ప్రమిదగా, ఆర్తిని నేయిగా, భగవద్దర్శనంవల్ల కలిగిన ఆనందాన్ని వత్తిగా చేసి అజ్ఞానాంధకారం దూరమయ్యేలా పరభక్తి అనే ఉజ్జ్వల దీపాన్ని నిండుమనస్సుతో కమలాక్షునికి అర్పించి, అర్చిస్తున్నాను."

ఇక మూడవవారైన పేయాళ్వారు శ్రీహరిసౌందర్యదర్శన కవితావైభవ దీపం ఇలా వెలిగించాడు.

"మీ ఉరస్స్థలాన లక్ష్మీ అమ్మవారినీ చూశాను. సుందరమైన మీ తిరుమేనూ చూశాను. సూర్యునిలా ప్రకాశవంతంగా ఉండే మీరూపాన్నీ దర్శించగలిగాను. సుందరసుదర్శన చక్రాన్నీ, శంఖాన్నీ మీ చేతుల్లో చూశాను. సముద్రవర్ణుడవగు ఓ శ్రీమన్నారాయణా ఇవన్నీ దర్శించాను."

ఇలా ముగ్గురు ఆళ్వారులూ మూడు దివ్య ప్రబంధాలలో కవితాజ్యోతులను వెలిగించి పెరుమాళ్లకు సమర్పించారు.

వీరు పరస్పరం వారివారిఊర్లపేర్లు కానీ, కులాలపేర్లు కానీ, తదితరవివరాలు కానీ తెలుసుకోలేదు. ప్రేమపూర్వకంగా పలుకరించుకున్నారు. హరిభక్తులయితే చాలు అని ముగ్గురూ కలుసుకున్నారు, భగవద్గుణ గానం చేశారు. అన్నిటికన్నా భగవదభిరుచి ప్రధానమని తెలియజేస్తుంది ఈ ముగ్గురు ఆళ్వారుల కలయిక.

### 4. తిరుమళిశై ఆళ్వారు (భక్తిసారయోగి)

**దివ్యప్రబంధ ముపదిశ్య తతో உ ఖిలేభ్యః**
**తం వేదసార మఖిలార్థనిధిం జనేభ్యః**
**అజ్ఞానఘోరతిమిరం త దపోహ్య తేషాం**
**స్వజ్ఞానదీపకళయా హ్యవనిం రరక్ష.**

భావం– వేదసారమై అఖిలార్థాలకూ నిధి అయిన దివ్యప్రబంధాలను జనులందరకూ ఉపదేశించి, వారి అజ్ఞానాంధకారాన్ని తనజ్ఞానం అనే దీపకళికతో పోగొట్టి, భూమిని రక్షించిన భక్తిసారులను శరణువేడుకుంటాను.



**మధ్యే కలి ర్ద్వాపరయో స్సహస్ర**
**వర్షాణి సప్తైవ విహృత్య భూమౌ**
**సౌదర్శనీం మూర్తి ముపాగతం చ**
**తం భక్తిసారం శరణం ప్రపద్యే.**

భావం– ద్వాపరయుగానికీ కలియుగానికీ నడుమ వేలసంవత్సరాలు భూమి మీద సంచరించినట్టి, సుదర్శనాంశాన జన్మించిన భక్తిసారులను శరణు పొందుతున్నాను.

శ్రీహరి సుదర్శనచక్రరాజాంశాన తిరుమళిశై ఆళ్వారులు అవతరించారు. మొదళాళ్వారులకు సమకాలీనులు, వీరు సిద్ధార్థినామసంవత్సర చాంద్ర పుష్య బహుళ విదియ మఖానక్షత్రాన అవతరించారు. (నేటి చెన్నైకి సమీపంలో ఉన్న) మహీసారపురం (తిరుమళిశై) వీరి జన్మస్థలం. కనకాంగి అనే అప్సరస, భార్గవముని వీరితలిదండ్రులు. పెంచిన తలిదండ్రులు పంకజచ్చొల్లియారు, తిరువాళరు అనే మేదరవారు. వీరిది అక్షమాలాముద్ర. వీరు రెండు దివ్యప్రబంధములు సాయించినారు. అవి – 1 నాన్ముగం తిరువన్దాది, (96 పాశురాలు) 2. తిరుచ్చంద విరుత్తము (120 పాశురాలు).

తిరుమళిశైఆళ్వారు జన్మించిన మహీసారపురం మహాపుణ్య క్షేత్రం. సప్తర్షులు తపస్సు చేసుకోవడానికి బ్రహ్మదేవుడు ఈ స్థలాన్ని సూచించినాడట! బ్రహ్మ ఆదేశానుసారం విశ్వకర్మ త్రాసులోని ఒక పళ్లెంలో భూమినీ, మరొక పళ్లెంలో మహీసారపురాన్నీ ఉంచి తూకం వేయగా మహీసారపురమే ఎక్కువగా తూగింది. అంతటి పవిత్రస్థలం మహీసారపురం.

సప్తర్షులలో భార్గవముని ఒకడు. భార్గవముని ధర్మపత్ని కనకాంగితో కలిసి మహీసారపురంలో దీర్ఘసత్రయాగాన్ని చేశారు. ఫలితంగా సుదర్శనాంశతో కనకాంగి గర్భం దాలుస్తుంది. అయితే నెలలు నిండాక ఆమె ఒక మాంసపు ముద్దను (పిండాన్ని) ప్రసవిస్తుంది. అందుకు ఆమె చాలా చింతించి ఆ మాంసపు ముద్దను ఒక వెదురు పొదలో పడవేసి వెళ్లింది.

సాక్షాత్తు శ్రీహరి – శ్రీదేవి అమ్మవారు ఆ పిండాన్ని కనికరిస్తారు. ఆ పిండానికి సంపూర్ణశిశుత్వాన్ని ప్రసాదించి, ఆకలిదప్పులు లేకుండ అనుగ్రహించి, అదృశ్యమవుతారు.

అలా ఏకాంతంగా ఆబాలుడు అరణ్యంలో ఏడుస్తుంటాడు. ఆ ఏడుపును ఒక మేదరివాడు విన్నాడు. అతనిపేరు తిరువాళరు. అతడు ఆ బాలుని ఎత్తుకొని ముద్దాడి ఇంటికి తీసుక వెళ్ళి తనభార్య పంకజ చ్చొల్లియారునకు ఇస్తారు. ఆమె సంతోషించి తన పొత్తిళ్ళలో హత్తుకున్నది, చనులలో పాలుకూడ పడినవి. అయితే ఎంత ప్రయత్నించినా ఆ పిల్లవాడు పాలను గ్రహించలేదు. ఈ వృత్తాంతాన్ని విన్న ఒక వృద్ధదంపతులు అక్కడకు విచ్చేస్తారు. వారు శూద్రులు. ఆవుపాలను తీసుకవచ్చి స్వీకరించ వలసినదిగా వారు ఆ బాలుడిని ప్రార్థిస్తారు. ఆ బాలుడు వారి ప్రార్థనలను అంగీకరించి పాలుతాగడం మొదలుపెడతాడు. ఇలా వారు పాలు అందిస్తూ ఉంటారు. ఆబాలుడు దినదినప్రవర్ధమానుడు కాసాగాడు.

ఆబాలయోగి (తిరుమళిశై ఆళ్వారు) ఆవృద్ధదంపతులకు ఒక మేలును చేయాలని భావిస్తాడు, వారితో ఆ బాలుడు "ఇన్నిదినాలు నన్ను కాపాడినారు కదా ! నేను తాగగా వదలిపెట్టిన పాలను మీరు తాగండి, మీకు ముసలితనం పోయి యౌవనం వస్తుంది. అందువల్ల మీకు కూడా సంతానం కలుగుతుంది" అంటాడు. ఆ వృద్ధదంపతులు ఆ బాలుని మాటలు విని అంగీకరించి అలాగే చేస్తారు. వారు యౌవన దశను పొంది కాల క్రమంలో ఒక బాలుని కంటారు. తమ శిశువునకు కణికృష్ణుడు అని పేరు పెడతారు. ఆ కణికృష్ణుడే తర్వాతి కాలంలో తిరుమళిశై ఆళ్వారుకు ప్రియశిష్యుడవుతాడు.

తిరుమళిశై ఆళ్వారు (మహీసార సూరి) బాల్యంలో బుట్టలు అల్లి నగరంలో విక్రయించి తలిదండ్రులకు సాయంగా ఉండేవాడు,

భార్గవఋషి పుత్రుడయిన ఆబాలుడు మేదరవృత్తిని మాని యోగాభ్యాసం చేయడానికి ప్రారంభిస్తాడు. తత్త్వదర్శనం చేయాలని అన్వేషణ



చేస్తాడు. మొదలాళ్వారులలో ఒకరైన పేయాళ్వారు, తిరుమళిశై ఆళ్వారుకు పంచ సంస్కారాలు చేసి శ్రీవైష్ణవ దీక్షను అనుగ్రహిస్తాడు. భగవదనుగ్రహం వలన శ్రీమన్నారాయణుడే పరతత్త్వమని భక్తిసారులు నిర్ణయించుకుంటారు. వీరు నాన్ముగంతిరువన్దాది (96 పాశురాలు), తిరుచ్చంద విరుత్తం (120 పాశురాలు) అనే దివ్య ప్రబంధాలను అనుగ్రహించారు.

ఒకసారి భక్తిసారులు ఒకగుహలో యోగసాధనలో ఉండగా మొదలాళ్వారులు ముగ్గురూ అక్కడకు వస్తారు. భగవద్గుణానుభవం కలిగిన ఆముగ్గురు ఆళ్వారులు చాలా దూరాన ఉండినపుడే వారు భక్తిసారులవారి దగ్గర ఉండే అప్రాకృత దివ్యతేజస్సును చూసి ఆనందిస్తారు. ఆముగ్గురు ఆళ్వారులూ భక్తిసారులను సేవిస్తారు. భక్తిసారులుకూడా ఆముగ్గురు ఆళ్వారులను సేవిస్తారు. వారు నలుగురూ మయిలాపురంలో కొంతకాలం ఉండి ఆతర్వాత ఎవరిదారిన వారు వెళ్లిపోతారు.

తర్వాత ఒకమారు శుక్తిహారుడు అనే ఖేచరుడు భక్తిసారులకు కవచం, రత్నహారం, ముత్యాలహారం ఇవ్వబోతాడు. అపుడు భక్తిసారులవారు తన ఆత్మసంకల్ప విరచితమైన స్వర్ణ నిర్మల వజ్రకవచాన్ని తులసీమాలికలను వాటి మహిమను చూపిస్తాడు శుక్తిహారునికి. అందుకు ఆ ఖేచరుడు భక్తిసారులవారిని బహువిధాలుగ స్తుతించి వెళ్లిపోతాడు.

ఒక పర్యాయం కొంకణసిద్ధుడు అనే రసవాది భక్తిసారుల వారిదగ్గరకు వస్తాడు. హేమరసగుళికలను సిద్ధుడు భక్తిసారులకు ఇస్తాడు. ఇదిమాకేల అని భక్తిసారుడు రసగుళికను తిరస్కరిస్తాడు. భక్తిసారులు తన చెవిలో ఉండే గుబిలిని (గుదిమిని) తీసి దానికి కొంత మన్నును చేర్చి సిద్ధునికి అనుగ్రహించి, దీనివలన కోట్ల విలువగల హేమాన్ని చేసుకోవచ్చంటాడు. సిద్ధుడు భక్తిసారులు ఇచ్చిన రసగుళికను పరీక్షచేసి, బంగారాన్ని తయారు చేసి, నిజాన్ని గ్రహిస్తాడు. అతడు ఆళ్వారు మహత్తును కొనియాడి వెడలిపోతాడు.

ఒకప్పుడు తిరుమళిశైఆళ్వారు సత్యవ్రతక్షేత్రం (కాంచీపురం) పుణ్యస్థలానికి వెళ్తాడు. అక్కడ ఉన్న మొదలాళ్వారులను సేవించుకుంటాడు. వారుకూడా భక్తిసారుని సేవించుకుంటారు.

తిరుమళిశైఆళ్వారుకు ఒకప్పుడు మహీసారపురంలో శ్వేతమృత్తిక (తిరుమణి) లభించదు. అపుడు భక్తిసారులు శ్రీమహావిష్ణువును ప్రార్థించగా స్వామివారు కలలో దర్శనమిచ్చి ఒక గవిని చూపిస్తాడు అక్కడ కావలసినంత తిరుమణి లభిస్తుంది. సంతోషంతో కేశవాదినామోచ్చారణపూర్వకంగా ద్వాదశోర్ధ్వపుండ్రాలను ధరించి భగవంతుని ఆరాధిస్తాడు.

తిరుమళిశై ఆళ్వారులు ఓ పర్యాయం కాంచీపురం వెళ్ళి పెరుమాళ్లను సేవించుకుని అక్కడ చాలాకాలం ఉంటాడు. వీరి వరప్రసాదాన ఇంతకు మునుపు వృద్ధదంపతులకు (యౌవనులుకాగా) జన్మించిన కణికణ్ణర్ అనే మహానుభావుడు భక్తిసారులను ఆశ్రయిస్తాడు. భక్తిసారులవారు కణికణ్ణర్ కు అఖిలహితోపదేశాలు చేసి శిష్యునిగా స్వీకరిస్తాడు.

భక్తిసారులు ఏర్పరచుకున్న పర్ణశాలకు రోజూ ఒక ముదుసలి అవ్వ వచ్చేది. ఆమె ఆపర్ణశాల ప్రాంతమంతా శుభ్రపరచి రంగవల్లులతో అలంకరించి భక్తిసారులను సేవించుకొనేది. భక్తిసారులు అవ్వచేసే సేవలకు సంతుష్టుడై ఏదైనా కోరిక కోరుకొమ్మంటాడు. దానికి ఆ అవ్వ తనకు యౌవనం అనుగ్రహించమని వేడుతుంది; భక్తిసారులు అలాగే అనుగ్రహిస్తాడు. ఆ ముదుసలి అవ్వ యౌవనవతి అవుతుంది.

శృంగారరసాధిదేవతలా ఉన్న ఆ నవయౌవనవతిని (పూర్వపు అవ్వను) ఒక పర్యాయం నగరాధీశుడయిన వల్లవరాయుడు వాహ్యాళికి వెళ్లినపుడు చూస్తాడు. ఆమె అందచందాలకు ఆశ్చర్యపోయి ఆకర్షితుడై ఆమెను పరిణయయాడి పట్టమహిషిగా స్వీకరిస్తాడు. కొంతకాలానికి వల్లవరాయనికి ముసలితనం వస్తుంది. కానీ ఆయనభార్యమాత్రం యౌవనవతిగానే ఉంటుంది. అందుకు కారణం భక్తిసారుల అనుగ్రహవిశేషమని ఆమె తన భర్తకు



తెలుపుతుంది. భక్తిసారులను ఎలా కలుసుకోవాలని వల్లవరాయడు తన భార్యను అడుగుతాడు. దానికి ఆమె "కణికణ్ణర్ అనే వారు భక్తిసారులవారి ప్రియశిష్యుడు. అతడు భిక్షాటనకై ఇలా వస్తుంటాడు. అతనిని ఆశ్రయిస్తే మీకు భక్తిసారుల దర్శనం చేయిస్తాడు" అని చెప్తుంది.

కొంత సమయానికి కణికణ్ణర్ అక్కడకు భిక్షాటనకు రానే వస్తాడు. రాజుగారు కణికణ్ణర్‌ను పూజించి "మీ ఆచార్యుని ఇక్కడకు రప్పించండి" అని కోరుతాడు. అపుడు కణికణ్ణర్ రాజుతో "మాఆచార్యులు భక్తిసారులవారు అధములను చూడరు" అంటాడు. "సరే! నీవు నన్ను గురించి కవిత్వం చెప్పాలి" అని అడుగుతాడు రాజు. అందుకు కణికణ్ణర్ "భగవద్భాగవతాచార్య విషయం తప్ప మిగతా స్తుతులు చేయజాలను" అంటాడు. అందుకు రాజుగారు కణికణ్ణర్‌ను తన రాజ్యం నుండి వెలివేస్తున్నట్లుగా ప్రకటిస్తాడు.

ఇక చేసేదేమిలేక కణికణ్ణర్ భక్తిసారుల దగ్గరకు వెళ్లి నమస్కరించి జరిగిన సంగతులను విన్నవిస్తాడు. అపుడు భక్తిసారులు "శిష్యా! ఇక్కడ నీవులేనప్పుడు నేను కూడా ఉండలేను, ఉండను. నేనూ నీ వెంటనే వస్తాను" అని వెంటనే అక్కడ వెలసిన శ్రీమన్నారాయణునికూడా నాతో బయలుదేరవలసిందని విన్నవిస్తాడు. భక్తిసారుల ప్రార్థనను అంగీకరించి ఆయన వెంట శ్రీహరికూడా శ్రీభూనీళాది సమేతంగా సమస్తపరివారంతో బయలుదేరుతాడు. అపుడు సత్యవ్రత (కాంచీపురం) క్షేత్రంలో ఉన్న దేవాలయాలన్నిటిలోనూ దేవతాదివిగ్రహాలు అంతర్ధానమవుతాయి. ఆ ప్రాంతమంతా అంధకారం అలుముకుంటుంది. ప్రకృతి వైపరీత్యాలు జరుగుతాయి. ఈపరిస్థితికి కారణాన్ని మంత్రులద్వారా తెలుసుకుంటాడు రాజుగారు. మంత్రివర్గంతో సహా రాజుగారు కణికణ్ణర్ ఉండిన చోటుకు వెళ్లి అతనికి సాష్టాంగదండప్రణామాలు చేసి వేడుకుని ప్రార్థిస్తాడు. కణికణ్ణర్ తన ఆచార్యులయిన భక్తిసారమునీంద్రులను "వీరందరినీ క్షమించి సత్యవ్రత క్షేత్రప్రాంతాన్ని కాపాడవలసిందని ప్రార్థిస్తాడు.

భక్తిసారయోగికూడ శ్రీమన్నారాయణుని సపరివారసమేతంగా తిరిగి కాంచీపురానికి (సత్యవ్రత క్షేత్రానికి) రమ్మని వేడుకుంటాడు. స్వామివారు తిరిగి కాంచీపుర ప్రాంతంలోని తనస్థానంలో శయనభంగిమలో నెలకొంటాడు. అప్పటినుండి ఆ స్వామివారికి శొణ్ణివణ్ణం శెయిదపెరుమాళ్ (యథోక్తకారి) అనే వ్యవహారనామం ఏర్పడుతుంది. యథోక్తకారి అంటే భక్తుడు చెప్పినట్లు నడుచుకున్న భగవంతుడు అని అర్థం. స్వామివారు నెలకొనగానే సత్యవ్రత క్షేత్రమంతా ఆనందమయంగా ఉంటుంది.

భక్తిసారయోగి సత్యవ్రత క్షేత్రంలో కొంత కాలం నివసించి ఆ తర్వాత కుంభకోణక్షేత్రానికి ప్రయాణం సాగిస్తాడు. ఆయన పెరుంబులియూరు అనే గ్రామాన్ని చేరుకుంటాడు. అక్కడ ఒకపెద్దఅరుగుమీద వేదాలను చదువుతున్న బ్రాహ్మణులను భక్తిసారులు చూస్తారు. భక్తిసారులు శూద్రుడని ఆబ్రాహ్మణులు వేదపఠనాన్ని నిలిపివేస్తారు. భక్తిసారులు అక్కడినుండి వెళ్ళిపోయేటందుకు తయారుకాగా విప్రులు తిరిగి వేదపఠనం చేసేందుకు ప్రారంభిస్తారు. అయితే వేదపఠనం వరుసలు మారి పఠించలేక తబ్బిబ్బు అవుతారు విప్రులు. అపుడు ఆ బ్రాహ్మణుల క్లిష్టపరిస్థితిని చూచి భక్తిసారులు వారిని కనికరించా లనుకుంటాడు. ఆ బ్రాహ్మణులు చూస్తుండగా భక్తిసారులు ఒక వడ్లగింజను (కృష్ణ వ్రీహి) తన గోటితో రెండు ముక్కలుగా చీలుస్తాడు. అపుడు ఆ బ్రాహ్మణులకు" కృష్ణానాం వ్రీహినాం నఖ నిర్భిన్నం" అనే వాక్యాలు స్ఫురిస్తాయి. వారు వెంటనే భక్తిసారులను ఆశ్రయించి క్షమించవలసినదిగా వేడుకుంటారు.

జ్ఞానానికి కులం ప్రధానం కాదు. నిజమైన భక్తులు శూద్రులు కారు. వారు బ్రాహ్మణోత్తములే, అన్ని వర్ణాలవారిలో కూడా భక్తి లేనివారే శూద్రులని పంచమవేదమయిన మహాభారతంలో చెప్పబడింది.

భక్తిసారులు పెరుంబులియారులోని ఏవీధులలో ఎటుముఖమై తిరుగాడాడో, ఆఊరిఆలయాలలోని అర్చామూర్తి కూడా అటువైపుగానే తిరుగసాగింది. అక్కడి అర్చకులు ఈవిచిత్రసంఘటనను గమనించి ఆ



ఊరిబయట యాగం చేస్తున్న బ్రాహ్మణోత్తములందరినీ రావించి జరుగుతున్న సంఘటనను తెలుపుతారు. ఆబ్రాహ్మణోత్తములు భక్తిసారుని యజ్ఞశాలకు తీసుకవచ్చి అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి అగ్ర పూజ చేస్తారు. కొందరు భక్తిసారులకు చేసే అగ్రపూజను వ్యతిరేకిస్తారు. అపుడు ప్రపన్న రక్షకుడైన పుండరీకాక్షుడు భక్తిసారులకు ప్రత్యక్షమై అనుగ్రహిస్తాడు. ఈదృశ్యాన్ని చూసిన అక్కడి జనులందరు భక్తిసారమునీంద్రులవారికి ప్రదక్షిణ చేసి బ్రహ్మరథంపట్టి ఊరేగిస్తారు.

భక్తిసారయోగి అక్కడినుండి కుంభకోణ దివ్యక్షేత్రానికి చేరుకుంటారు. అక్కడ శ్రీహరిని సేవించుకుంటారు. శ్రీసుదర్శన చక్రరాజంలో ఐక్యమవుతారు.

తిరుమళిశై ఆళ్వారులు నాన్ముగం తిరువన్దాది, తిరుచ్చంద విరుత్తం అనే రెండు దివ్యప్రబంధాలను అనుగ్రహించారు. ఈ రెండింటిలోను తిరుమళిశై ఆళ్వారు మంగళాశాసనం చేసిన దివ్యతిరుపతుల వివరాలు సంక్షిప్తంగా తెలుసుకుందాం–

నాన్ముగం తిరువందాదిలో– 1. శ్రీరంగం, 2. అన్బిల్, 3. తిరుప్పేర్‌నగర్ / కోవిలడి, 4. తిరుక్కుడందై, 5. కపిస్థలం, 6. తిరుక్కోట్టియూర్, 7. తిరువెఃశికా / యథోక్తకారిసన్నిధి, 8. తిరువళ్లూరు, 9. తిరువల్లిక్కేణి, 10. తిరువెంగడం, 11. ద్వారక, 12. తిరుప్పార్‌కడల్, 13. పరమపదం.

తిరుమళిశై ఆళ్వారు తిరుచ్చందవిరుత్త దివ్యప్రబంధంలో మంగళాశాసనం చేసిన దివ్యతిరుపతుల సంక్షిప్త వివరాలు–

1. తిరుక్కుడందై, 2. తిరుక్కురుంగుడి, 3. తిరుప్పాగడం, 4. తిరు ఊరగం, 5. యథోక్తకారిసన్నిధి, 6. తిరువెంగడం, 7. తిరుప్పార్‌కడల్, 8. పరమపదం.

తిరుమళిశై ఆళ్వారు వేంకటాచలంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరుని మంగళాశాసనం చేసిన పాశురాలలో మచ్చునకు–

నాన్ముగన్ తిరువన్దాది నుండి – శబ్దం చేస్తూ ప్రవహిస్తున్న సెల ఏళ్లు – రత్నాలనూ ముత్యాలనూ వెదజల్లుతూ ఉన్నాయి. దీనికి తోడుగా నీజన్మదినమైన శ్రవణానక్షత్రాన కూడిన పండుగరోజున భక్తులందరూ నాలుగు వైపులనుంచీ విచ్చేసి, భక్తితో మంగళాశాసనం చేస్తున్నారు. అలాంటి సమయాన చాలా ఆశతో నాహృదయంలో ప్రవేశించావు. ఆహా! ఏమి నీసౌశీల్యం! పరమభోగ్యమైన వేంకటాచలపర్వతాన్ని దర్శించుకోవాలని నేను చాలా ఆశపడుతున్నాను.

తిరుమళిశైఆళ్వారువారు తిరుచ్చంద విరుత్తంలో తిరుమలను మంగళాశాసనం చేసి ఒక పాశురం మచ్చునకు–

రాత్రివేళలలో మంచుకరిగి వర్షంగా కురుస్తుంటుంది, ఆ మంచు భారాన్ని తట్టుకోనలేక వెదుళ్లు కిందికి వంగి ఉంటాయి. ఉదయం అయ్యాక సూర్యుని కిరణాలకు ఆ మంచుగడ్డలు కరుగుతాయి. అలాంటి వాతావరణం కలిగిన శ్రీవేంకటాచలం మీద వేంచేసియున్న వాడు ఆ పరంధాముడే.

**తిరుమళిశై ఆళ్వార్ దివ్య దివ్యతిరువడిగళే శరణం**

## 5. కులశేఖరాళ్వారు

**దివ్యం య త్త దనుత్తమాద్భుతతరం**
**శ్రోతృశ్రవానందనం**
**విఖ్యాతం కులశేఖరార్యచరితం**
**భక్తాబ్జసూర్యోదయం,**
**పుణ్యం పాపవినాశనం భవహరం**
**సంపత్కరం సర్వదం**
**యే శ్రుణ్వంతి పఠన్తి సౌమ్యహృదయా**
**స్సంపూర్ణకామా హి తే.**

భావం– దివ్యమైనదీ, చాలా ఉత్తమమైనదీ, పరమాద్భుతమైనదీ, వినేవారికి శ్రవణానందకరమైనదీ, భక్తులు అనే పద్మాలను వికసింపజేసే సూర్యోదయం



వంటిదీ, పుణ్యాన్ని ఇచ్చేదీ, పాపవిమోచనం చేసేదీ, సంసారబంధాన్ని తొలగించేదీ, సంపదను ఇచ్చేదీ, అయిన కులశేఖరులవారి చరిత్రను విన్నా చదివినా అలాంటి సహృదయులకు వెంటనే వారి మంచికోరికలు నెరవేరుతాయి. అలాంటి కులశేఖరులకు వందనాలు.

శ్రీహరి కౌస్తుభాంశాన కులశేఖరాళ్వారు అవతరించారు. చేరదేశం (మళయాళరాష్ట్రం – కేరళరాష్ట్రం)లోని కోళిపట్టణంలో వీరు జన్మించారు. ఈ పట్టణానికి కొల్లి నగరం, కుక్కుట కూటం, కుక్కుటపురం, కొళకూరు, కురువంజి కళత్తరే, క్విలన్, తిరువాన్కూరు అని వ్యవహారనామాలు. కులశేఖరులవారు చంద్రవంశానికి చెందిన క్షత్రియరాజయిన దృఢవ్రతుని కుమారుడు. మార్గశిరమాసం, శుద్ధద్వాదశి, పునర్వసు నక్షత్రాన కులశేఖరులు జన్మించారు. శ్రీరామచంద్ర పెరుమాళ్ – కులశేఖర ఇద్దరూ పునర్వసు నక్షత్ర జాతకులే, పెరుమాళ్ శబ్దవాచ్యులే కావడం ప్రస్తుతం స్మరణీయం. తమకులానికి శిరోభూషణుడుగా జన్మించాడని తలిదండ్రులు భావించడంవల్ల, కులశేఖరుడు అని చెప్తారు ఈ ఆళ్వారును.

విష్వక్సేనులవారు కులశేఖరులవారిని పంచసంస్కారసంపన్నుని చేసిన ఆచార్యులు. కులశేఖరులు అంజలిముద్రతో దర్శనమిస్తారు.

భగవంతునికి (పెరుమాళ్ళకు) రక్షకునిగా ఉన్నందువల్ల, "పెరుమాళ్ తిరుమొళి" అనే దివ్యప్రబంధం రచించడం వల్ల వీరికి కులశేఖర పెరుమాళ్ అనే వ్యవహారం కలిగిందంటారు. వీరు 67 సంవత్సరాలు జీవించారు, 105 పాశురాలుగల "పెరుమాళ్ తిరుమొళి" అనే దివ్య ప్రబంధాన్ని రచించిన వీరు సంస్కృతంలో "ముకుందమాల" అనే శ్రీకృష్ణస్తుత్యాత్మక రచనను చేశారు.

దృఢవ్రతమహారాజు వానప్రస్థాశ్రమం స్వీకరించి కులశేఖరుల వారికి రాజ్యభారాన్ని అప్పగిస్తారు. కులశేఖరులు ప్రతాపవంతుడు, ప్రజారంజకంగా పరిపాలన సాగించినవారు. పరిపాలనా దక్షుడు. ఇతనికి శత్రుత్వం కానీ ప్రజలలో వ్యతిరేకత కానీ లేదు. ఈయన పాలనా కాలంలో జంతువులలోని

మేక – బెబ్బులి లాంటి జాతివైరం కలిగిన పశువులుకూడా ఒకే రేవులో నీళ్లుతాగే వంటారు.

కులశేఖరులవారికి ఒక కుమారుడు, ఒక కూతురు. వీరికూతురు నీళాదేవి అంశాన జన్మించారు. ఆమెను కులశేఖరులవారు శ్రీరంగ నాథులవారికి సమర్పించినట్లు చెప్తారు (ఆళ్వారులలో విష్ణుచిత్తులవారు కూడా తన పెంపుడు కూతురు గోదాదేవిని శ్రీరంగనాథులవారికే సమర్పించడం ప్రస్తుతం స్మరణీయం)

కులశేఖరులవారు సకలవైష్ణవులతోనూ సద్గోష్ఠి చేసేవారు. వీరు వీర రసావతారమూర్తి అయినా కూడా సాధువులను బీదప్రజానీకాన్నీ ఆదరించేవారు.

దివ్యగుణ సంపన్నులయిన కులశేఖరులవారు ప్రతిరోజూ రామాయణ గోష్ఠిలో నిమగ్నులై ఉండేవారు. ఒకరోజు కొందరు పౌరాణికులు శ్రీరంగనాథులవారి దివ్యమహిమలను వర్ణించి చెప్పగా కులశేఖరులవారు తనుకూడా రంగనాథులవారిని దర్శించుకోవాలని తహతహపడతారు. భార్యా పుత్రాదులనూ, రాజ్యాన్నీ వదలిపెట్టి శ్రీరంగ క్షేత్రంలో ఉండాలనుకుంటాడు. "శ్రీరంగ క్షేత్రానికి వెళ్లిపోతున్నాను. అందరూ రండి" అని చాటింపు వేయిస్తారు. సరిగా ఆదే సమయానికి ద్వాదశోర్ధ్వపుండ్రధారులయిన వైష్ణవోత్తములు రాజుగారికి ఎదురుపడేలా కొందరు చేస్తుండేవారు. కులశేఖరులవారు వైష్ణవోత్తములయిన వారిని పూజించడానికి ప్రయాణాన్ని మానుకునేవారు. ఈ విషయమే "ఘుష్యతే యస్య నగరే రంగయాత్రా దినే దినే" అనేశ్లోకం సుస్పష్టం చేస్తుంది.

కులశేఖరులవారికి భక్త్యావేశం ఎక్కువ. ఒకరోజు వీరు రామాయణగాథ వింటూ ఉంటారు. ఆ కథలో "రాముడు అరణ్యవాసం చేస్తూ సీతారామ లక్ష్మణులతో కలిసి ఒక గుహదగ్గరకు చేరుకుంటాడు. అపుడు ఖరదూషణాది రాక్షసులు వేలసైన్యంతో అక్కడకు వచ్చి అలజడి చేస్తారు.



రాముడు లక్ష్మణుని గుహదగ్గర సీతకు కాపలాగా ఉంచి తానొక్కడే రాక్షసులతో యుద్ధం చేయడానికి వెళతాడు" ఈ గాథ వినగానే కులశేఖరులవారు రామునికి సాయం చేయాలనేభావంతో చతురంగబలాలతో దండయాత్రకు సిద్ధపడతాడు, ఆ సందర్భాన మంత్రులు, కులశేఖరులతో రాముడు విజయం సాధించాడని చెప్తారు. అపుడు కులశేఖరులు యుద్ధ ప్రయత్నం ఆపివేస్తాడు. రాముడంటే అంతటి భక్తిగౌరవాలన్నమాట.

మరొక పర్యాయం సీతను రావణుడు అపహరించుక వెళ్లాడనే రామాయణ ప్రవచనం జరుగుతూ ఉంటుంది. దానిని విన్న కులశేఖరులు రావణసంహారం చేయడానికి సముద్రతీరానికి చేరుకుంటాడు. అపుడు కరుణా సముద్రుడగు రాముడు సీతాలక్ష్మణ సమేతంగా కులశేఖరులవారికి దర్శనమిచ్చి రావణసంహారం జరిగిందని చెప్తారు. అపుడు కులశేఖరులవారు తిరిగి తన పురానికి వెళ్తారు.

నిరంతరం శ్రీవైష్ణవసాంగత్యంవల్ల కులశేఖరులు మందు డవుతున్నాడని భావించిన మంత్రులు ఒక ఉపాయాన్ని పన్నుతారు. అందులో భాగంగా – కులశేఖరులవారి పూజామందిరంలోని పెట్టెలో ఉన్న ఒక ముత్యాలహారాన్ని దాచిపెడతారు. భగవన్మందిరంలోనికి వైష్ణవులు తప్ప ఎవరూ వెళ్ళరు. వారే ఆ ముత్యాలహారాన్ని దొంగిలించి ఉంటారని మంత్రులు కులశేఖరులవారితో చెప్పారు. రాజుగారు ఆ వార్తను నమ్మలేదు. ఒక నల్లనాగుపామునోట్లో తన చేయి దూర్చి శ్రీవైష్ణవులు దొంగలయితే ఈ పాము తనను కాటు వేస్తుందని చెప్తారు. కానీ పాము కాటు వేయలేదు. మంత్రులు తాము చేసిన తప్పిదాన్ని ఒప్పుకుంటారు.

కులశేఖరులవారు తన కుమారునకు రాజ్యాధిపత్యాన్ని ఇచ్చి తాను శ్రీరంగాన్ని చేరుకుంటారు. శ్రీరంగనాథులవారిని పరమభక్తితో సేవించుకుంటూ చివరిదాకా కాలం గడుపుతారు. భగవత్స్వరూప గుణవిభూతి ఉపపాదకమైన పెరుమాళ్ తిరుమొళిని, ముకుందమాలను రచిస్తారు.

పెరుమాళ్ తిరుమొళి అంటే కులశేఖరపెరుమాళ్ చెప్పిన (తిరు=సు, మొళి= ఉక్తి) సూక్తి. కులశేఖర శ్రీసూక్తి అని అర్థం, పెరుమాళ్ తిరుమొళి నాలుగవదశకంలో తిరుమలపై వేంచేసి ఉన్న వేంకటేశునిపై కులశేఖరులవారి భక్తిరసం కట్టలు తెగి పారింది. ఒక పాశురంలో తిరుమలవాసుని "ఓ వేంకటాచలపతీ! నాకు ఈ లోకమే కాదు, స్వర్గరాజ్యం ఇచ్చినా వద్దు. తండ్రీ! నీ బంగారు కొండపై ఉండనిస్తే చాలు, నీపాదపద్మాలదాకా పూలను చేర్పించే మెట్లవరుసగా నన్నుండనీయరాదా! నీతులసి పూలతోటకు నీరుపారేకాలువగా నన్ను పుట్టింపరాదా! నీసుందరమైన మందిరంలో నన్నొక స్తంభంగా నిలుపరాదా! నీపాదార్చనకోసం పూలను అందించే ఒక పూల మొక్కగా నన్ను చేయరాదా! స్వామిపుష్కరిణిలో తళుకు తుళుకుమంటూ ఎగిరే చేపలలో నన్నొక చేపపిల్లగా ఉండేటట్లు అనుగ్రహించరాదా! నీ 'గర్భగుడి'కి గడపగా పడిఉంటే, నీదర్మనంకోసం నీ భక్తులపాద ధూళిలో నలిగి నీపాదారవిందాలను సేవిస్తూ ఉంటాను కదా!" అంటూ భక్త్యావేశంతో వివశులై పడిపోయారట కులశేఖరులు. నేటికి కూడా తిరుమలలోని శ్రీవారి గర్భాలయం గడపకు "కులశేఖరప్పడి" అనే వ్యవహారం ఉంది. మహాభక్తవరేణ్యులకు కానీ ఇంతటి తన్మయత్వం కలుగదు కదా!

కులశేఖరులవారి ముకుందమాలస్తోత్రం యావద్భారతదేశంలో నాగరి మరియు అన్ని ప్రాంతీయలిపులలో ముద్రితమై ప్రాచుర్యం పొందింది. ముకుందమాల తావులగుబాళింపులప్రభావం భక్తులను మైమరపిస్తుంది.

కులశేఖరాళ్వారు సాయించిన దివ్య ప్రబంధం పెరుమాళ్తిరుమొళిలో మంగళాశాసనం చేయబడిన దివ్య తిరుపతుల వివరాలు సంక్షిప్తంగా-

1. తిరువరంగం, 2. తిరువేంగడం, 3. తిరువిత్తువక్కోడు, 4. తిరుక్కణ్ణపురం, 5. తిరుచ్చిత్తిరకూడం, 6. తిరువాలి, 7. తిరువయోధ్య, 8. వడమధురై, 9. తిరుప్పార్కడల్, 10. పరమపదం.



కులశేఖరాళ్వారులు శ్రీవేంకటాచలమును మంగళాశాసనం చేసిన పాశురాలలో ఒకపాశుర భావం-

మదించి లోకాలను హింసించే వృషభాలను మర్దించి, నీళాదేవిని పెళ్లిచేసుకున్న ఆశ్రితపక్షపాతి అయిన సర్వేశ్వరుని కైంకర్యాన్ని నేను ఎల్లప్పుడూ కోరుకుంటాను. ఆలాంటి భాగ్యం లేని సిరిసంపదలతో మానుషజన్మను కూడా నేను ఆశించను. పాంచజన్యదివ్యశంఖాన్ని ఎడమచేత ధరించిన శ్రీమన్నారాయణుడు వేంకటాచలంలో వేంచేసి ఉన్నారు. అట్టి వేంకటాచలంలో శ్రీస్వామి పుష్కరిణిలో నివసించేభాగ్యం కలిగిన ఒక పక్షిగా పుట్టాలని ఆశిస్తున్నాను.

**కులశేఖరాళ్వార్ దివ్యతిరువడిగళే శరణం.**

## 6. పెరియాళ్వారు (విష్ణుచిత్తులు)

**తాదాత్మికప్రతిభయా భగవత్పరత్వం**
**విస్తీర్య పాండ్యకటకే విజయీ గజేన,**
**గచ్ఛన్ ప్రియా దుపగతే గరుడేనవాథే**
**ప్రేమ్ణాఽ ఽశిషం రచయతి స్మ నమో ఽస్తు తస్మై.**

భావం- శ్రీమన్నారాయణుని కటాక్షంతో అప్పటికప్పుడు లభించిన పాండిత్యంతో నారాయణపరత్వాన్ని పాండ్యరాజు సభలో విస్తరింపజేసి జయించి విష్ణుచిత్తులు ఏనుగుపై ఊరేగించబడ్డారు. ఆఉత్సవాన్ని చూచేవేడ్కతో శ్రీమన్నారాయణుడు గరుత్మంతునిపై వేంచేయగా ప్రేమతో వారికి మంగళాశాసనం చేసిన విష్ణుచిత్తుల / పెరియాళ్వారు వారికి నమస్కారం.

శ్రీహరి వాహనమైన గరుత్మంతుని అంశతో పెరియాళ్వారులవారు అవతరించారు. క్రోధననామ సంవత్సరంలో సూర్యుడు మిథునరాశిలో ఉన్నప్పుడు జ్యేష్ఠమాసం, శుక్లపక్షం, ఏకాదశి, భానువాసరం, స్వాతీ నక్షత్రం

రోజున విష్ణుచిత్తులవారు జన్మించారు. వీరికి విష్వక్సేనులవారు పంచ సంస్కారాలు కావించారు. ముకుందార్య - పద్మావతి వీరి జన్మ ప్రదాతలు.

విష్ణుచిత్తులవారు శాలావృతగోత్రజులు, బోధాయన సూత్రులు, యజుశ్శాఖీయులు, పురశ్చూడులు (ముందుకు జుట్టుముడి వేసుకునేవారు) వీరు శ్రీవిలుపుత్తూరు వాస్తవ్యులు (చెన్నై-త్రివేంద్రం రైలుమార్గంలో శ్రీ విల్లిపుత్తూరు ఉంది). విలు (విల్లు) - అంటే ధనువు, పుత్తు - అంటే కొత్త (నవ్య) అని అర్థం. శ్రీవిల్లిపుత్తూరును - ధన్వీనవ్యపురం (ధన్విపురం) అని సంస్కృతీకరించారు. శ్రీ - విల్లి- పుత్తు- ఊరు - ఈ నాలుగు పదాలు చేరి శ్రీవిల్లిపుత్తూరు అయింది. శ్రీ - సంపద్యుక్తమైన మంగళకరమైన, విల్లు- ఉపవనాలతో, పుత్తు-కొత్త, ఊరు - గ్రామం. 'విల్లు' అనే వ్యక్తి నిర్మించిన ఆలయందగ్గర పూర్వం చీమల కొండ ఉండేదనీ అందువల్ల విల్లుపుత్తూరు అనే పేరు కలిగిందనీ కూడా స్థలపురాణజ్ఞులు చెప్పారు. ఇది పాండ్యనాడులో ఉంది.

విష్ణుచిత్తులవారు సహజదాస్యైకరతులు. విల్లిపుత్తూరులో వెలసిన పెరుంగోయిలుడయాన్ స్వామివారికి పుష్పమాలా కైంకర్యం చేయడమే ప్రధాన కర్తవ్యంగా భావించిన పుణ్యమూర్తి విష్ణుచిత్తులవారు. వీరు ఈ కైంకర్యం చేయడానికి మూడు యోజనాల విస్తారమైన తిరునందనవనం ఏర్పాటు చేసుకున్నారు. నిరంతరం శ్రీతులసీపుష్పమాలికాదులు పెరుమాళ్లకు సమర్పణం చేసేవారు. ఇలా రోజులు గడుస్తుండేవి.

ఒక సందర్భంలో పాండ్యదేశానికి రాజైన వల్లభ రాయదు అనే ప్రభువు రాత్రిపూట శోధనార్థమై నగరసంచారం చేశాదు. అపుడు రాజుగారు ఒక వీధిలో ద్వారవేదిక మీద ఒక విప్రుడు నిద్రించి ఉండడం చూశాదు. అపుడు ఆ విప్రుని వివరాలను తెలుసుకున్నాదు. ఆ విప్రునితో రాజుగారు "ఒక మంచి శ్లోకం చదవమన్నాదు. ఆ బ్రాహ్మణుదు సార్వకాలీన, సార్వజనీనమైన శ్లోకాన్ని చెప్పాదు. రాజుగారు శ్లోకభావాన్ని గ్రహించి "జీవితమంతా వృథా అవుతోంది



కదా!" అని చింతించి తన పురోహితుడయిన సెల్వనంబిని పిలిపించుకొని ఆలోచిస్తాదు. సెల్వనంబి పరతత్త్వనిర్ణయం చేయడానికి ఒక విద్వత్సభను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆ పురోహితుని మాటమేరకు రాజుగారు విద్వాంసుల నందరనూ పిలిపించి ఒక సభను ఏర్పాటు చేయిస్తాదు. విద్యాశుల్కంగా కొంతధనాన్ని ముల్లె కట్టి ఒక తోరణస్తంభానికి కట్టిస్తాదు.

ఆ రోజు వడపెరుంగోయిలుడయాన్ పెరుమాళ్లు విష్ణుచిత్తులవారికి స్వప్నంలో సాక్షాత్కరించి "ఓయీ! నీవు పాండ్యరాజు విద్వత్సభకు వెళ్ళు, అక్కడ పరపక్షవిక్షేపపూర్వకంగా సర్వవేదాంత ప్రతిపాదకమైన పరతత్త్వాన్ని స్థాపించి విద్యాశుల్కాన్ని విజయోత్సవ పూర్వకంగా తీసుకో" అంటాదు.

విష్ణుచిత్తులవారు పెరుమాళ్లతో - "సర్వవేదాంత ప్రతిపాద్య వేదశాస్త్రాధ్యయనాన్ని చేయనివాడను. జ్ఞానవాసన లేనివాడను. విద్యాశుల్కం తేగల అధికారం లేనివాడిని" అంటాదు. అపుడు శ్రీహరి తానే సర్వభార నిర్వాహకుడనని తెల్పి విష్ణుచిత్తుని విద్వద్గోష్ఠికి పంపిస్తాదు.

విద్వద్గోష్ఠికి విష్ణుచిత్తులవారు వెళ్తాదు. సభాప్రాంగణంలో వల్లవరాయలు, పురోహితుడు సెల్వనంబి అతనికి స్వాగతం పలుకుతారు. ఆ సభలోని విద్వాంసులు విష్ణుచిత్తుని మీద ద్వేషంతో రాజును అధిక్షేపిస్తారు. అయినా సెల్వనంబి విష్ణుచిత్తులవారిని ఆహ్వానించి పరతత్త్వనిర్ణయం చేయవలసిందని ప్రార్థిస్తాదు.

సభలో వాదప్రతివాదాలు జరుగుతుంటాయి. అది గమనించి ధన్విపుర నిత్యవాసుడైన పెరుమాళ్లు విష్ణుచిత్తులను అనుగ్రహించి వాదనకు సిద్ధపరుస్తాదు. ఫలితంగా విష్ణుచిత్తులవారు శ్రీమన్నారాయణుడే పరతత్త్వమని నిర్ణయించి సిద్ధాంతస్థాపనం చేస్తాదు. అపుడు తోరణస్తంభానికి కట్టబడిన విద్యాశుల్కపుమూట విష్ణుచిత్తులవారి పాదాల చెంత పడుతుంది.

ఈఅపూర్వమైనసంఘటనకు అందరూ సంతోషిస్తారు. జయసూచకంగా పాండ్యరాజు విష్ణుచిత్తులవారికి 'భట్టనాథుడు' అనే

బిరుదనామం ఇచ్చి సత్కరించి పూజించి ఊరేగింపు ఏర్పాటు చేస్తాడు. ఆ సందర్భాన విష్ణుచిత్తులవారిని భద్రగజంపైకి ఎక్కించి సపరివారంగా మంగళవాద్యాలు మోగగా బ్రహ్మరథం పడతారు. పండితులందరూ ఛత్రచామరసేవచేస్తూ బ్రహ్మరథాన్ని అనుసరిస్తారు.

శ్రీహరి లక్ష్మీసమేతుడుగ గరుడవాహనారూఢుడై ఆకాశమార్గంలో విష్ణుచిత్తులవారి ఊరేగింపును తిలకిస్తాడు. వేల్పులు శ్రీస్వామివారిని అనుసరించిఉంటారు. ఈదృశ్యాన్ని చూచినవిష్ణుచిత్తులవారు శ్రీమన్నారాయణునికి 'పల్లాండు' పాడుతారు.

ఈకార్యక్రమం అంతా అయిపోయాక విష్ణుచిత్తులవారు తిరిగి శ్రీవిల్లిపుత్తూరు చేరుకుని పెరుమాళ్ల పుష్పకైంకర్యపరులై జీవనయాత్ర సాగిస్తారు.

విష్ణుచిత్తులవారు తిరుప్పల్లాండు (12 పాశురాలు), పెరియ తిరుమొళి (461 పాశురాలు) అనే దివ్యప్రబంధాలను సాయించినారు.

పెరియాళ్వారులు సాయించిన తిరుప్పల్లాండు, పెరియాళ్వార్ తిరుమొళిలో మంగళాశాసనంచేసిన దివ్యదేశాలు తిరునామాలు–

1. తిరువరంగం, 2. తిరువెళ్లరై, 3. తిరుప్పేర్‌నగర్, 4. తిరుక్కుడందై, 5. తిరుక్కణ్ణపురం, 6. తిరుమాలిరుంజోలై, 7. తిరుక్కోట్టియూర్, 8. శ్రీవిల్లిపుత్తూర్, 9. తిరుక్కుఱుంగుడి, 10. తిరువేంగడం, 11. తిరువయోధ్య, 12. సాలగ్రామం, 13. బదరికాశ్రమం, 14. తిరుక్కణ్డం, 15. ద్వారకై, 16. వడమధురై, 17. తిరువాయ్‌ప్పాడి, 18. తిరుప్పార్‌కడల్, 19. పరమపదం.

వేంకటాచలంలో వేంచేసిన స్వామివారిని గురించి మంగళాశాసనం చేసిన (తిరుమొళి) పాశురాలలో మచ్చునకు ఒక దాని భావం–



పెరియాళ్వారు, యశోదగా శ్రీకృష్ణుడు తన బాలుడుగా భావించి చెప్పినభావం ఇది. – "ఓ నాముద్దులతండ్రీ! పరిమళభరితమైనదివ్యోద్యానాలతో మనోజ్ఞంగా ఉండే వేంకటాచలమందు నిత్యనివాసంచేసేవాడా! నల్లనివాడా! వృషభాలవలె ఇష్టానుసారం తిరిగేవాడా! నీవు కోరిన మంచిగొడుగు, చెప్పులు, పిల్లనగ్రోవి తెప్పించాను. వాటిని తీసుకోక దూడలను మేపడంలోనే వ్యామోహంతో ఉన్నావు. వాటివెంట కారడవుల్లో తిరుగుతూ నీ కోమలదివ్య వదనారవిందం వాడిపోయింది. చాలా అలసి పోయావు. అయ్యో! ఇదంతా చూసి నేను సహించలేకున్నాను.

శ్రీకృష్ణునిమీద ఆళ్వారుకు ఎంతమక్కువ ఉందో ఈ పాశురం చెప్పింది.

(విష్ణుచిత్తులవారి పెంపుడుకూతురు ఆండాళ్. ఈమే గోదాదేవి. ఈ తల్లిని గూర్చిన విశేషాలు "ఆండాళ్" శీర్షికలో వివరించబడినాయి.

**పెరియాళ్వార్ దివ్యతిరువడిగళే శరణం**

## 7. ఆండాళ్ (గోదాదేవి)

**శ్రీవిష్ణుచిత్తకులనందనకల్పవల్లీం**
**శ్రీరంగరాజహరిచందనయోగదృశ్యామ్,**
**సాక్షాత్ క్షమాం కరుణయా కమలా మి వాన్యాం**
**గోదా మనన్యశరణ శ్శరణం ప్రపద్యే.**

భావం– శ్రీవిష్ణుచిత్తునివంశం అనేనందనవనమందు ఉన్నకల్పలతిక శ్రీరంగరాజు అనే హరిచందన తరువుతో అల్లుకోవడం చేత చూడ సొంపైనదై, అపరలక్ష్మీ దేవిలా దయామయియై, సాక్షాత్తుగా క్షమాస్వరూపిణి అయిన గోదాదేవిని, ఇతరులను రక్షకత్వం వేడని వాడనై ప్రపత్తి చేస్తున్నాను.

శ్రీహరిపత్ని అయిన భూదేవిఅంశతో ఆండాళ్ అవతరించింది. నళనామ సంవత్సర కర్కాటకమాస (శ్రావణమాస) శుద్ధ చతుర్థి, పుబ్బ నక్షత్రం

మంగళవారం నాడు శ్రీవిల్లిపుత్తూరులో ఆండాళ్ అవతరించింది. పెంపుడు తండ్రి పెరియాళ్వారు.

ఆండాళ్ విష్ణుచిత్తులవారికి పూలతోటలో లభిస్తుంది కాబట్టి 'కోదై' అనే నామకరణం చేశాడు. 'కోదై' అంటే అందాల పుష్పసరం అని అర్థం. భూమిని సంస్కృతంలో 'గో' అంటారు. 'ద' అంటే అనుగ్రహించిన, భూదేవి అంశతో అవతరించిందికాబట్టి 'గోదా' అనే సంస్కృతనామంకూడా సార్థకమైనదే, ఈమె శుక(చిలుక) ముద్ర కలిగి ఉంటుంది.

ఆండాళమ్మవారి మరో పేరు 'చూడికుడుతనాచ్చియార్'. తాను ధరించిన పూలదండను పెరుమాళ్లకు సమర్పించినది కనుక చూడికుడుత అనే పేరు కలిగింది. ఈ పేరునే (అనంతాచార్యులవారు 'ప్రపన్నామృతం'లో మొట్ట మొదటిసారిగ 'ఆముక్తమాల్యద' అని సంస్కృతీకరించారు. ఆ పేరుననే రాయల వారు తెలుగు ప్రబంధం రచించారు)

ఇక ఆండాళ్ తల్లిగాథను తెలుసుకుందాం-

వైకుంఠంలో ఒకరోజు నారాయణుడు యోగనిద్రనుంచి మేల్కొంటాడు. అపుడు భూదేవి నారాయణునితో" భూలోకాన ఎవరిని ఎక్కువగా ప్రేమిస్తావు" అని అడుగుతుంది.

నిష్కామభక్తితో ఉండే వారిని ఎక్కువగా ప్రేమిస్తానని భూదేవితో పెరుమాళ్లు చెప్తాడు. అపుడు భూదేవి తనకు భూలోకాన అవతరించే అవకాశం కల్పించమనీ, పెరుమాళ్ల సేవను, భగవత్సంకీర్తనను చేసుకుంటూ ఉండేటట్లు అనుగ్రహించమనీ అర్థిస్తుంది. పెరుమాళ్లు ఆమెకోరికను అనుగ్రహిస్తాడు. అపుడు శ్రీవిల్లిపుత్తూరులో విష్ణుచిత్తులవారికి పూలతోటలో శిశువుగా అవతరించి లభిస్తుంది. అపుడు విష్ణుచిత్తులవారి ఆనందానికి అవధులు ఉండవు. ఆయన బిడ్డకు 'కోదై' అని నామకరణం చేశాడు.



విష్ణుచిత్తుడు ఆమెను పవిత్రమైన, శక్తివంతమైన వాతావరణంలో శ్రీకృష్ణుని గాథలను వినిపిస్తూ పెంచుతాడు. ఆమె పెరియాళ్వారులకు / (విష్ణుచిత్తులకు) పూలను సమకూర్చడం, తులసిని సమకూర్చడం మొదలయిన మాలాకైంకర్య కార్యక్రమాలలో సహకరిస్తూ ఉంటుంది. ఆ బాలిక దిన దినాభివృద్ధి చెంది యుక్తవయసుకు చేరుకుంటుంది. పెరుమాళ్లను తప్ప ఇతరులను పెళ్లాడరాదని నిశ్చయించుకుంటుంది. విష్ణుచిత్తులు పూలబుట్టలను ఇంట్లో ఉంచి వాటిని సాయం సమయాన ఆలయానికి తీసుకుని వెళుతుంటాడు. ఆ పూలను మాలికగా గుచ్చి ఆండాళు అలంకరించుకొని అక్కడ ఉన్న 'దర్పణ తీర్థం' (కోనేరు పుష్కరిణి)లో తన ప్రతిబింబాన్ని చూసుకొని తాను పెరుమాళ్లకు సరైన జోడి ఔనా కాదా అని ఊహించుకుంటూ ఉంటుంది. ఆమె ప్రతిరోజూ తాను ధరించిన పూలమాలను తన మేనినుండి జాగ్రతగా విడదీసి తన తండ్రికి తెలియకుండ వాటిని పెరుమాళ్లసన్నిధికి తీసుకవెళ్ళే పూలబుట్టలో పెడుతుంది. ఒకరోజు విష్ణుచిత్తుడు ఇంటికి తొందరగా రావడంవల్ల ఆండాళమ్మ పనిని చూస్తాడు, ఆ పూలు పెరుమాళ్లకు సమర్పించేందుకు పనికిరావని వేరే పూలు సేకరించేందుకు సమయం చాలక ఆరోజు పెరుమాళ్లకు పుష్పకైంకర్యం చేయడు.

ఆరాత్రి విష్ణుచిత్తులవారికి పెరుమాళ్లు స్వప్నదర్శనమిచ్చి పుష్పకైంకర్యంలో ఎందుకు విఫలమయ్యావని అడుగుతాడు. విష్ణుచిత్తుడు తన కూతురుచేసిన పనివల్ల సమయానికి పూలను సమర్పించలేని పరిస్థితి ఏర్పడిందని విన్నవిస్తాడు. అపుడు పెరుమాళ్లు కోదై ధరించిన పూలమాలలంటే తనకు ఎంతో ఇష్టమనీ, అవి ధరించడం తనకు మధురానుభూతిని కలిగిస్తుందనీ చెప్పాడు. ప్రతిరోజు కూడా కోదై ధరించిన తర్వాతనే ఆ పూలను తనసేవకు తేవలసిందిగా పెరుమాళ్లు పెరియాళ్వారును ఆజ్ఞాపిస్తాడు, విష్ణుచిత్తుడు తన కూతురు గొప్పతనాన్ని గ్రహిస్తాడు, ఆయన తన కూతురును" ఎన్నె ఆండాళ్ – ఎన్నె ఆండాళ్" అని ప్రశంసిస్తాడు. అంటే "నన్నేలిన నాతల్లీ! – నన్నేలిన నాతల్లీ!" అని అర్థం, అప్పటి నుంచి ఆమెకు ఆండాళ్ అనే పేరు

ప్రచారం అవుతుంది. అంతేకాదు – ఆమె అప్పటినుంచి చూడికుదుత నాచ్చియార్ (ఆముక్తమాల్యద) అని పిలువబడుతుంది. శ్రీరంగనాథులవారిని వివాహం ఆడుతానని ఆండాళ్ పట్టుబడితే పెరియాళ్వారు అందుకు అంగీకరిస్తాడు.

ఒకరోజు శ్రీరంగనాథుడు విష్ణుచిత్తునికి స్వప్నసాక్షాత్కారం అవుతాడు. ఆండాళ్‌ను శ్రీరంగానికి తోడ్కరమ్మని సెలవిస్తాడు. అదే సమయాన శ్రీరంగంలోకూడ ఆలయార్చకునికి స్వప్నంలో కనిపించి శ్రీవిల్లిపుత్తూరుకు ఛత్రం, వాలు, వెండిబెత్తాలతో వెళ్లి ఆండాళును రాజగౌరవలాంఛనాలతో తీసుక రమ్మని ఆజ్ఞాపిస్తారు. శ్రీరంగ పరివారం శ్రీవిల్లిపుత్తూరుకు వెళ్లి పెరియాళ్వారులకు ఈసందేశం తెలియజేస్తారు. ఆతర్వాత ఆండాళును పల్లకిలో ఊరేగింపుగా శ్రీరంగానికి తీసుక వెళ్తారు. ఎంతో ఆడంబరంగా పవిత్రకాహళాది శబ్దాలతో ఆండాళ్ సపరివారంగా రంగరంగ వైభవంగా శ్రీరంగం చేరుకుంటుంది.

శ్రీరంగనాథులవారు ఆండాళ్‌ను పాణిగ్రహణం చేసేందుకు తన సంసిద్ధతను తెలియజేస్తారు. పెరియాళ్వారు మహదానందభరితుడవుతాడు. ఆయన వారి పరిణయం శ్రీవిల్లిపుత్తూరులో సంప్రదాయబద్ధంగా అందరూ తిలకించేటట్లు జరగాలని శ్రీరంగనాథులవారికి విన్నవిస్తారు.

శ్రీవిల్లిపుత్తూరులో వివాహానికి అన్ని సిద్ధం చేస్తారు. శ్రీరంగం నుంచి శ్రీరంగనాథులవారిరాకకు విల్లిపుత్తూరులో అందరూ ఎదురు చూస్తుంటారు. అయితే రంగనాథులు వస్తున్న చిహ్నాలు ఏవీ కనిపించవు. అందుకు ఆండాళ్ చాలా బాధపడుతుంది. ముహూర్తానికి ముందే రంగనాథుని తోడ్కొని రావలసిందని గరుత్మంతుని (ద్విజకుల తిలకుని – పక్షి శ్రేష్ఠుని) అభ్యర్థిస్తుంది. గరుడుడు అలాచేస్తే ఆయనకు శ్రీరంగనాథ ఆండాళులతో సమానస్థానం కల్పిస్తానని తెలియజేస్తుంది. గరుడుడు శ్రీరంగనాథునితో సుముహూర్త



సమయానికి శ్రీవిల్లిపుత్తూరు చేరుకుంటాడు. శ్రీరంగనాథ గోదాదేవీ పరిణయోత్సవం వైభవంగా జరుగుతుంది.

శ్రీరంగనాథుని ఎడమవైపున గరుడుడు కుడివైపున ఆండాళమ్మ ఉండే విగ్రహాలు నేడుకూడా శ్రీవిల్లిపుత్తూరులో దర్శనమిస్తున్నాయి.

ఆండాళమ్మ "నాచ్చియార్ తిరుమొళి" (143 పాశురాలు), తిరుప్పావై (30 పాశురాలు) అనే ద్రావిడ దివ్యప్రబంధాలను రచించింది.

మగువలు మంచిమగడు లభించేందుకు చేసే నోముకు సంబంధించిన రచన తిరుప్పావై. ఇది ఉన్నతమైన వేదాంతగ్రంథంగా కూడా అభిజ్ఞులకు దర్శనమిస్తోంది.

ఆండాళమ్మ అనుగ్రహించిన దివ్యప్రబంధంలో మంగళాశాసనం చేసిన దివ్యతిరుపతులు–

1. తిరువరంగం, 2. తిరుక్కుడన్దై, 3. తిరుక్కణ్ణపురం, 4. తిరుమాలిరుంజోలై, 5. శ్రీవిల్లిపుత్తూర్, 6. తిరువెంగడం, 7. ద్వారకై, 8. వడమధురై, 9. తిరువాయ్‌ప్పాడి, 10. తిరుప్పార్‌కడల్, 11. పరమపదం.

గోదాదేవి నాచ్చియార్ తిరుమొళిలో శ్రీవేంకటాచలమును గురించిన మంగళాశాసన పాశురాలలో మచ్చునకు ఒకదాని భావం.

ఓ మదనదేవా! తై మాసంలో ముప్పైదినాలూ నీవు వేంచేయ దగిన స్థలాలన్నీ బాగా కసవు చిమ్మి, నీళ్లు చల్లి, ముగ్గులు వేసి అలంకరించాం. మండలపూజ చేసేందుకు మండలాలను ఏర్పరచాం. మాసిమాసాన మొదటి పక్షమంతా నీవు వేంచేయదగిన వీధులను తళతళలాడే సుందరమైన ఇసుకను చల్లి అలంకరించాం. ఉజ్జీవించడానికి అనుకూలమైన నిన్ను, నీ తమ్ముడిని సేవిస్తున్నారు. ఆశ్రితుల విరోధులపై నిప్పులు కక్కుతూ జాజ్వల్యమానమై ఉన్న, అద్వితీయమైన చక్రాయుధాన్ని చేతధరించి, కల్యాణాద్భుతగాత్రుడై

సేవసాయించే ఆ వేంకటాచలపతికే, సర్వకాల సర్వావస్థలలలోనూ సర్వవిధ కైంకర్యాలు చేసేలా దాసురాలిని అనుగ్రహించు.

**ఆండాళ్ దివ్యతిరువడిగళే శరణం.**

## 8. తొండరడిప్పొడియాళ్వారు (విప్రనారాయణులు)

**చోళక్షితౌ ధనుషి మాసి మహేంద్రతారే**
**యః ప్రాదురాస మురభిద్వనమాలికాంశః,**
**రంగేశకేళిసఖ మూర్ధ్వశిఖం ద్విజేంద్రం**
**భక్తాంఘ్రిరేణు మనఘాత్మగుణం ప్రపద్యే.**

భావం– చోళదేశంలో ధనుర్మాసాన జ్యేష్ఠానక్షత్రాన శ్రీమన్నారాయణుని వనమాలాంశతో అవతరించినట్టివాడూ, శ్రీరంగనాథుని నర్మసఖుడూ, ముందుకుముడిగల జుట్టు ఉన్న (పురశ్చూడ) బ్రాహ్మణ శ్రేష్ఠుడూ, పాపరహితుడూ, సద్గుణవంతుడూ అయిన తొండరడిప్పొడియాళ్వారును / విప్రనారాయణులను శరణువేడుతున్నాను.

శ్రీహరి వైజయంతి వనమాలాంశాన తొండరడిప్పొడియాళ్వారులు అవతరించారు. పురశ్చూడుడు వేదవిశారదుడు అయిన బ్రాహ్మణోత్తముని (పేరు తెలియదు) కుమారుడు తొండరడిప్పొడి ఆళ్వారు. ప్రభవ నామసంవత్సర ధనుర్మాస (పుష్యమాస) బహుళ చతుర్థి జ్యేష్ఠా నక్షత్రం మంగళవారం వీరి జన్మదినం. వీరిది పుష్పమాలా ముద్ర. విష్వక్సేనులవారు వీరికి పంచసంస్కారాలు చేసి మంత్ర మంత్రార్థాలను అనుగ్రహించారు. చోళమండలంలోని మండంగుడి అగ్రహారం వీరిజన్మస్థలం. వీరికి విప్రనారాయణులు అని కూడా పేరు. వీరు తిరుప్పళ్లియెళుచ్చి (10 పాశురాలు), తిరుమాలై (45 పాశురాలు) సాయించినారు.

విప్రనారాయణులు మండంగుడి అగ్రహారంలో విద్యాభ్యాసం ముగించుకొని బ్రహ్మచారిగనే ఉంటూ శ్రీరంగంలో శ్రీరంగనాథులవారిని



సేవించుకోవడానికి వెళ్లారు. శ్రీరంగనాథులవారిని దర్శించి తన్మయుడయ్యాడు. ఇక వీరిగాథను సంక్షిప్తంగా తెలుసుకుందాం–

**మాలాం సకృత్సమర్ప్యైకాం శ్రీకృష్ణాయ స్వసద్మని,**
**మాలాకారో ౭ భవ త్తేన కృతార్థో భగవత్ప్రియః**
**అతః ప్రియతమే ష్వస్య కైంకర్యే ష్వఖిలేషు చ,**
**శ్రీపుష్పదామకైంకర్యం సుతరాం భగవత్ప్రియమ్.**

భావం– మాలాకారుడు తన ఇంట్లో శ్రీకృష్ణునికి ఒక మాలను సమర్పించినంత మాత్రానసే భగవంతునికి ఇష్టుడై కృతార్థుడయ్యాడు కదా!

కనుక భగవంతునికి ఇష్టమైన కైంకర్యాలన్నిటిలోనూ పుష్పమాలా కైంకర్యం మిక్కిలి ప్రీతికరమైనది,

పూర్వపు మాలాకారులు పుష్పదామాలను శ్రీహరికి అర్పించినట్లు తానుకూడా ఒక పూలతోటను ఏర్పరచి కస్తూరిరంగనికి పుష్పమాలా కైంకర్యం చేయాలని నిర్ణయించుకుంటాడు విప్రనారాయణుడు. వీరు శ్రీరంగంలో తాను ఏర్పాటు చేసిన పూలతోటలోనే పర్ణశాలను నిర్మించుకుని అందే నివాసం ఉంటారు. విప్రనారాయణుడు ప్రతిరోజు తనతోటలోని పుష్పఫలాలను శ్రీరంగనాథులవారికి సమర్పిస్తూ ఉంటాడు.

విప్రనారాయణుని గురించి ఒకనాడు శ్రీరంగనాథులవారు తన పత్ని శ్రీదేవితో "విప్రనారాయణుని నా లీలావిధేయునిగా చేసుకుని కొన్నాళ్లు ఇలాగే ఉండి ఆతర్వాత అతడిని నాభక్తాగ్రగణ్యునిగా చేసుకుంటాను. ఇది విప్రనారాయణుని ప్రారబ్ధకర్మ" అంటాడు. ఈ మాటలకు రంగనాయకి సరే అంటుంది.

తిరుక్కరంబన్ అనే గ్రామంలో దేవకీదేవి అనే ఒక అందమైన వారవిలాసిని ఉంటుంది. ఆమె ఒకరోజు తనఅక్క మధురవాణితో, సహచరగణంతో నిచుళాపురం చేరుకుంటుంది. అక్కడ రాజుగారితో సన్మానాలు

పొంది, తిరుగు ప్రయాణం చేస్తూ ఉంటుంది. ఆమె మార్గమధ్యంలో ఉన్న విప్రనారాయణునిపుష్పవనాన్ని చూచి దానిఅందచందాలకు ఆకర్షితురాలవుతుంది. దేవదేవి ఆమెఅక్క మరియు తన సహచరగణాలతో పుష్పవనవిహారం చేస్తూ ఉంటుంది.

విప్రనారాయణుడు హరిసేవా కైంకర్యపరుడై ఏకాగ్రచిత్తంతో వీరిని ఎవరినీ చూడక దాటి వెళ్లిపోతాడు. అపుడు దేవదేవి తన అక్కతో "అక్కా! ఇతడు మతిభ్రమ కలవాడా! లేక షండుడా ! మనవైపు కన్నెత్తి కూడా చూడలేదు" అంటుంది. అపుడు మధురవాణి "చెల్లీ! ఈయన సర్వేంద్రియాలూ శ్రీహరి అధీనాలు. ఇతడు షండుడు కాదు, వెంగలి కూడా కాదు" అని సమాధానం చెప్తుంది. అపుడు దేవదేవి – ''మహనీయులు సైతం పూర్వం కాంతాదాసులయ్యారు కదా! ఈ బాపని మార్చడం అదో లెక్కా! ఆరు నెలల్లో ఇతణ్ణి నా దాసునిగా మారుస్తాను. అలా చేయలేక పోతే నీ ఇంట్లో ఆరునెలలు ఊడిగం చేస్తాను" అంటుంది. పందెం మాటలు అలా సాగినవి. మధురవాణి తన ఇంటికి తిరిగి వెళ్లిపోయింది. దేవదేవి మాత్రం అక్కడే ఉంది. తన వేషభాషలను మార్చి భక్తురాలుగ నటించసాగింది. విప్రనారాయణుని ముందు వినమ్రయై నిలిచింది దేవదేవి. అపుడు విప్రనారాయణుడు కుశలప్రశ్నలు వేసి ఆమె రాకకు కారణం ఏమిటని అడిగాడు. అపుడు దేవదేవి విప్రనారాయణునితో– "నా తల్లి నన్ను బలవంతంగా వేశ్యావృత్తిలోకి దించే ప్రయత్నం చేసింది. అందుకు ఒప్పుకొనక నేను పారిపోయి వచ్చి మీ దర్శనం కాగానే మిమ్మల్ని శరణు కోరుతున్నాను" అని చెప్పింది. "స్వామీ ! మీ సేవ చేస్తూ పూలవనాన్ని పెంచుతూ ఇక్కడే ఉంటాను. అనుగ్రహించండి" అని దేవదేవి విప్రనారాయణుని అభ్యర్థించింది. విప్రనారాయణుడు అందుకు సమ్మతించాడు.

ఇద్దరూ తోటపనులు చేసుకుంటున్నారు కానీ విప్రనారాయణుడు మాత్రం దేవదేవిని కన్నెత్తికూడా చూడడం లేదు. అప్పుడు దేవదేవి శ్రీ రంగనాథుని తనను కటాక్షించవలసిందిగా ప్రార్థించింది.



శ్రీరంగనాథుడు దేవదేవిని కనికరించాడు. మాయను కల్పించాడు. అకాలవర్షం కురిపించాడు. విప్రనారాయణుడు చెట్లకు నీళ్లు పోయడం మాని పర్ణశాలకు వెళ్లి అనుష్ఠానపరుడై ఉంటాడు. దేవదేవి మాత్రం పర్ణశాల ద్వారం వద్దనే నిలబడి వానకు తడుస్తూ చలికి వణకుతూ ఉంటుంది. తన ఎదుట తడసి ముద్దై వణకుతున్న దేవదేవిని చూసి విప్రనారాయణుడు కరుణతో ఆమెను పర్ణశాలలోకి రమ్మని, పొడి వస్త్రాన్ని ఆమెకు ఇస్తాడు. ఆమె ఆ పొడివస్త్రాన్ని కట్టుకొని చేతులు జోడించి విప్రనారాయణుని పాదసేవ చేస్తానని అభ్యర్థిస్తుంది. ఆయన 'సరే' అన్నాడు. ఆమె విప్రనారాయణుని పాదాలు ఒత్తుతూ ఉంది.

వయ్యారిభామ, సుకుమారమైన చేతులు, ప్రేమ చూపులు. మన్మథుడికి మంచి అవకాశం దొరికింది. ఆయన విప్రనారాయణుడిలో ఆవేశించాడు. విప్రనారాయణుడు అగ్నిదగ్గరకు చేర్చిన నేయిలా కరిగిపోయాడు. ఆమె సకలకళాచతుర. అతనిఇంగితాన్ని గుర్తించి ఆకర్షించింది. ఆయన మోహపరవశుడయ్యాడు. ఇద్దరూ ఏకమయ్యారు. తనివితీరా ఆ రాత్రి శారీరక సుఖాలను అనుభవించారు.

దేవదేవి తన పంతాన్ని నెగ్గించుకుంది. విప్రనారాయణుని తనవశం చేసుకుంది. అతడిని తననగరానికి తనసొంతఇంటికి ఆహ్వానించింది. విప్రనారాయణుడు దేవదేవి మాటలన్నీ అంగీకరించి వేశ్యాగృహం చేరుకున్నాడు.

పందెంలో ఓడిన మధురవాణి తన చెల్లి అయిన దేవదేవి ఇంట ఊడిగం చేయడం ప్రారంభించింది.

వేశ్య దేవదేవి ఇంట్లో విప్రనారాయణుడు శృంగారక్రీడావినోదాలతో గడుపసాగాడు. ప్రతిరోజూ ధనాన్ని తెచ్చి దేవదేవికి ఇస్తున్నాడు. విప్రనారాయణుడు ధనహీనుడయ్యాడు. వేశ్యామాత విప్రనారాయణుని ఇంటినుంచి గెంటివేసింది. ఆ రోజు రాత్రివేళ అతడు వేశ్యాగృహం బయట

అరుగుమీద నిద్రించాడు. ఉదయం అక్కడి నుండి కూడా వేశ్యామాత విప్రనారాయణుని తరిమివేసింది.

శ్రీరంగనాథుడు శ్రీరంగనాయకి ఇదంతా చూశారు. విప్రనారాయణునిపై దయ చూపించవలసిందిగా శ్రీరంగనాయకి శ్రీరంగ నాథులవారిని అడిగింది. శ్రీరంగనాథుడు 'సరే' అని తానొక విప్ర బ్రహ్మచారిగా మారి దేవాలయంలో ఆరాధనలో ఉపయోగపడే శుద్ధోదకపాత్రను తీసుకొని దేవదేవి గృహానికి వెళ్లి– "నేను విప్రనారాయణులవారి శిష్యుణ్ణి. మా గురువుగారు ఈబంగారుపాత్రను మీకు ఇమ్మని నన్ను పంపారు" అని చెప్పాడు. దేవదేవి ఆ పాత్రను గ్రహించి విప్రనారాయణుని పిలుచుకురమ్మని ఒక చెలికత్తెను పంపిస్తుంది. ఆమె విప్రనారాయణుని వెంటబెట్టుకొని వస్తుంది.

వేశ్యామాత, దేవదేవి, ఆమె పరివారజనం విప్రనారాయణుని సగౌరవంగా ఇంటిలోకి తీసుకవెళ్లారు. దేవదేవి విప్రనారాయణులు ఆ రోజు రాత్రి సుఖశయ్యానందంలో ఓలలాడారు. రాత్రి గడిచిపోయింది.

ఉషోదయాన శ్రీరంగనాథులవారికి సుప్రభాతాది కైంకర్యాలు పూర్తి అయినవి. అక్కడి అర్చకులు పరిశీలించగా ఆరాధనలో ఉపయోగించే పాత్రలలో శుద్ధోదక స్వర్ణపాత్ర కనిపించలేదు. అర్చకులు భయపడి ఆ వార్తను రాజుగారికి తెలియజేస్తారు.

రాజుగారు అర్చకులను మందలించి పసిడిగిన్నె ఎక్కడుందో కనుగొనవలసిందని దండనాథునకు ఆజ్ఞాపిస్తాడు. దండనాథుడు అర్చకబృందాన్ని దండిస్తుంటే వారిలో ఒకడు దేవదేవి పరివారంలోని ఒక చేటికతో పరిచయం కలవాడు. ఆ చేటిక తనతో పరిచయం కలిగిన వ్యక్తిని దండనాథుడు దండించడం చూసి వివరాలు గుట్టుగా తెలుసుకుంటుంది. ఆ చేటిక తన పరిచయస్థునికి బంగారుగిన్నె ఎక్కడ ఉండేది ఎలా అక్కడకు చేరింది చెప్తుంది. అపుడు ఆ చేటీ విటుడు ఈ విషయాన్ని దండనాథునికి విన్నవించుకుంటాడు.



అపుడు దండనాథుడు భటులతో కూడా దేవదేవి ఇంటికి వెళ్లి పరిశీలించి చూస్తే బంగారుగిన్నె దొరుకుతుంది. దేవదేవిని వెంట బెట్టుకొని రాజుగారి సన్నిధిలో అప్పగించాడు దండనాథుడు. రాజుగారు దేవదేవిని విచారించాడు. దేవదేవి తనకు ఆ పసిడిగిన్నెను విప్రనారాయణుడు ఇచ్చినట్లు చెప్తుంది. విప్రనారాయణుని విచారిస్తే తానివ్వలేదన్నాడు. అపుడు దేవదేవి, విప్రనారాయణుడు పంపించినట్లు ఆయన శిష్యుడు వచ్చి ఆగిన్నెను ఇచ్చి వెళ్లాడని చెప్తుంది. అపుడు విప్రనారాయణుడు 'మా కెవ్వరూ శిష్యులూ దూతలూ లేరు' అని చెప్తాడు. ఆలయఅర్చకులను నిర్దోషులుగా పంపించివేస్తారు. దేవతాద్రవ్యాన్ని తీసుకున్నందుకు దేవదేవికి అపరాధరుసుం కట్టవలసిందని చెప్తారు. ఇక బంగారు పాత్రను దొంగలించిన విప్రనారాయణునకు శాస్త్రోక్తంగా దండన విధించండని రాజుగారు దండనాథుని ఆజ్ఞాపించి అంతఃపురానికి వెళ్లిపోతాడు.

ఆ రోజు రాత్రి రాజుగారికి స్వప్నంలో శ్రీరంగనాథులవారు కనిపించి 'విప్రనారాయణుడు నిరపరాధి. ప్రారబ్ధకర్మానుసారం నేనే ఇలాంటి అనుభవాన్ని కల్పించాను, అతడిని పూజించి విడుదల చేయండి" అని ఆజ్ఞాపిస్తాడు.

అరుణోదయమైంది. రాజుమేల్కొంటాడు. స్వప్నంలో శ్రీరంగనాథుల వారు చెప్పినవాక్యాలను తలచుకున్నాడు రాజుగారు. వెంటనే విప్రనారాయణుని దగ్గరకు వెళ్లి, నమస్కరించి, ప్రదక్షిణం చేసి, అపరాధాన్ని క్షమించమని వేడుకొని, సకలమర్యాదలు చేసి సత్కరించి పంపిస్తాడు.

ఇక దేవదేవి కొంతకాలం పుష్పమాలా కైంకర్యం చేస్తూ, భాగవతులను సేవించుకుంటూ చివరకు పరమపదిస్తుంది.

భక్తుల అంఘ్రిరేణువు తనకు నిరూపకనామంగా భక్తాంఘ్రిరేణువు (తొండరడిప్పొడి) అనే దివ్యనామం ధరించిన విప్రనారాయణులు తిరుమాలై

తిరుప్పళ్లియెళుచ్చి అనే దివ్యప్రబంధాలు సాయించారు. అవతారం చివరకు శ్రీవిష్ణుసాయుజ్యం పొందారు.

తొండరడిప్పొడియాళ్వార్ దివ్యప్రబంధాలలో 1. తిరువరంగం, 2. తిరుప్పార్‌కడల్, 3. పరమపదం, అనే దివ్యతిరుపతులను మంగళాశాసనం చేశారు.

**తొండరడిప్పొడియాళ్వారు దివ్యతిరువడిగళే శరణం.**

## 9. తిరుప్పాణాళ్వారు (శ్రీపాణయోగి)

**శ్రీలోకసారంగమహామునీంద్ర**
**స్కంధాధిరూఢం కలయామి నిత్యమ్,**
**కలంకహీనం కమనీయభక్తం**
**కవీశ్వరం గాయకసార్వభౌమమ్.**

భావం– శ్రీలోకసారంగమహామునీంద్రుల భుజస్కంధాలపై అధిష్ఠించినట్టివాడూ, నిష్కలంకుడూ, మంచిభక్తికలవాడూ, కవీశ్వరుడూ గాయకసార్వభౌముడూ అయిన శ్రీపాణయోగికి / తిరుప్పాణాళ్వారులకు నమస్కారం.

శ్రీహరి శ్రీవత్సం అంశతో తిరుప్పాణాళ్వారులు అవతరించారు. వీరిది వీణాముద్ర. దుర్మతినామ సంవత్సర కార్తిక పూర్ణిమ, వృశ్చికమాసంలో రోహిణీ నక్షత్రం బుధవారంనాడు శ్రీపాణయోగి జన్మించారు. వీరి జీవిత కాలం 80 సంవత్సరాలని పెద్దలమాట. వీరికి విష్వక్సేనులవారు పంచసంస్కారాలు చేశారు.

శ్రీరంగానికి సమీపాన ఉండే నిచుళాపురం (తిరువరయూర్) తిరుప్పాణాళ్వారు జన్మస్థలం. వీరు శ్రీమన్నారాయణని శ్రీవత్సం అంశాన వరిచేనులో వరివెన్నులో పుట్టారు. పంచముల (దళితుల) ఇంట్లో పెరిగారు. వీరు జ్ఞానవైరాగ్యసంపన్నజన్మసంసిద్ధవైష్ణవులు.



కవీశ్వరునిగా, గాయకసార్వభౌమునిగా కీర్తించబడ్డారు. వీణ మీటుతూ తాళాలను తాటిస్తూ 'తన్వయత్వం చెంది నిరంతరం తన కవితాగానాలతో శ్రీరంగనాథులవారిని భజించిన ధన్యజీవి తిరుప్పాణాళ్వారు.

శ్రీరంగనాథులవారు ఉభయకావేరుల మధ్యన విరాజిల్లారు. తిరుప్పాణులవారు పంచముడు కావడంవల్ల తనపాదాలను పవిత్ర రంగభూమికి తాకించరాదనే నియమాన్ని పాటించారు. అందువలన కావేరి దక్షిణతీరంనుంచే శ్రీరంగనాథులవారి దివ్యమందిరానికి ఎదురుగా తాళాన్వితంగా వీణాగానంతో తన్మయుడై భగవంతుని భజిస్తుంటాడు.

శ్రీరంగనాథుల వారి అర్చకులయిన లోకసారంగముని అనే ద్విజుడు పెరుమాళ్ల కైంకర్యార్థం కావేరి నుంచి కలశంతో తీర్థం తెస్తుంటాడు. అలాంటి ఒక సందర్భాన తిరుప్పాణాళ్వారు యథారీతిగా భగవద్భజనపరవశుడై బాహ్యావిషయాలను ఎరుగని పరిస్థితిలో ఉంటాడు. లోకసారంగముని వెంట ఉండే బ్రాహ్మణవర్గం "పంచమా! దారికి అడ్డుతొలగిపో!" అంటూ తిరుప్పాణులవారిని రాళ్ళతో కొడతారు. దెబ్బలు తగిలిన తిరుప్పాణులవారు తనదారిన తాను వెళ్లిపోతారు. అర్చక ద్విజులు శ్రీరంగనాథులవారి ఆలయానికి వెళ్లగా పెరుమాళ్లముఖం దెబ్బలు తగిలిన గాయాలతో రక్తం కారుతూ ఉన్నట్లు కనిపిస్తుంది. ఈవిషయం ఆప్రాంతప్రజలకీ ప్రభువుకీ తెలుస్తుంది. వారు "శ్రీరంగనాథులవారికి ఏదో దోషం జరిగినందువల్ల ఇలా అయి ఉంటుంది. తప్పు జరిగి ఉంటే క్షమించాలి' అని ప్రార్థిస్తారు. వారి ప్రార్థనకు శ్రీరంగనాయకి స్పందించి శ్రీరంగనాథుల వారితో తిరుప్పాణులను రక్షించి సన్నిధికి చేర్చుకోవాలి" అని చెప్తుంది.

శ్రీరంగనాథులవారు లోకసారంగమునికి స్వప్నంలో కన్పించి తిరుప్పాణాళ్వారులవారిని తమసన్నిధికి రప్పించవలసిందని ఆజ్ఞాపిస్తారు, అర్చకుడు తిరుప్పాణులవారి దగ్గరకు వెళ్లి శ్రీరంగనాథులవారి సన్నిధానానికి రావలసిందని అభ్యర్థిస్తాడు. తిరుప్పాణులవారు తాను పంచముడననీ పవిత్ర

శ్రీరంగభూమిని పాదాలతో తాకరాదనే నియమం కలవాడిననీ విన్నవిస్తాడు. తిరుప్పాణులను తీసుకొని వెళ్లకపోతే భగవదాజ్ఞను ధిక్కరించినట్లవుతుంది. కనుక, లోకసారంగముని, అటు భగవదాజ్ఞను ఇటు తిరుప్పాణులవారి నియమాన్నీ ఉల్లంఘించరాదని ఉపాయాన్ని అన్వేషిస్తాడు. చివరకు తిరుప్పాణాళ్వారును తన భుజాలపై మోసుకుని శ్రీరంగనాథులవారి సన్నిధానానికి చేరుకుంటాడు. లోకసారంగముని వాహనంగా శ్రీరంగనాథులవారి సన్నిధికి వెళ్లడం వలన తిరుప్పాణులకు "మునివాహన" అనే పేరు కలుగుతుంది.

తిరుప్పాణులవారు శ్రీరంగనాథులవారి దివ్యమంగళవిగ్రహాన్ని సందర్శిస్తారు. ఆనందపారవశ్యంతో ప్రతిస్పందిస్తారు. ఫలితంగా ఆయనలో పెల్లుబికిన భావసుధాఝరులు 'అమలనాదిపిరాన్' అనే ద్రావిడ దివ్యప్రబంధంగా (10 పాశురాలలో) అనుగ్రహించబడింది.

భగవంతుని వర్ణించేటప్పుడు ప్రప్రథమంగ పాదాలను ఆ తర్వాత వరుసగా శిరోభాగపర్యంతం వర్ణించడం సంప్రదాయం. ఈ సంప్రదాయం అమలనాదిపిరాన్ లో భాసించింది. శ్రీరంగనాథులవారి సౌందర్యం ఒక దివ్యమంగళప్రవాహం. ఆప్రవాహాన అవగాహించాలంటే భగవానుని శ్రీచరణకమలాలే తీర్థఘట్టాలు (గంగ విష్ణుపాదోద్భవ కదా!). ఈ గుట్టు తిరుప్పాణాళ్వారులవారికి బాగాతెలుసు.

తిరుప్పాణులవారు భక్తిజ్ఞానంలో శ్రీరంగనాథులవారిని వశం చేసుకొని పెరుమాళ్ల పాదమూలాన్ని చేరారు.

తిరుప్పాణాళ్వారు అమలనాదిపిరాన్‌లో మంగళాశాసనం చేసిన దివ్యతిరుపతులు – 1. తిరువరంగం, 2. తిరువెంగడం, 3. పరమపదం.

తిరుప్పాణాళ్వారు శ్రీవేంకటాచలమందు వేంచేసి ఉన్న స్వామివారిని అమలనాదిపిరాన్‌లో ప్రశంసించారు. మచ్చునకు ఒక పాశురభావం– తిరుమలలో మగ కోతులు ఒక కొమ్మనుంచి మరొక కొమ్మకు దుముకుతూ



ఎగురుతూ క్రీడిస్తుంటాయి. ఆదృశ్యాన్ని చూచేవారికి కనులపండువే, అరవభాషకు ఉత్తరపు ఎల్ల (సరిహద్దు) అయినట్టి, మహోన్నత శిఖరాలతో అలరారేది శ్రీవేంకటాచలం, నామనస్సులో ఉండేజీవుడు వేంకటాచలాధిపతి మీద శ్రీరంగనాథునిమీద లగ్నమై ఉన్నాడు. ఆహా! ఏమి ఆశ్చర్యం.

**తిరుప్పాణాళ్వార్ దివ్య తిరువడిగళే శరణం.**

## 10. తిరుమంగై ఆళ్వారు (పరకాలయోగి)

**చతుర్థవర్ణే ఉ చ్యుతశార్ఙ్గశక్త్యా**
**కృతోదయం కార్తికకృత్తికాయామ్,**
**రంగైకకైంకర్యతరంగితాంశం**
**చతుష్కవీంద్రం శరణం ప్రపద్యే.**

భావం– కార్తికమాసం కృత్తికానక్షత్రాన శూద్రవర్ణంలో శ్రీమన్నారాయణుని శార్ఙ్గధనువు అంశాన అవతరించినవాడూ, శ్రీరంగనాథులవారి కైంకర్య సంలగ్నచిత్తుడూ, చతుష్కవీంద్రబిరుదాంచితుడూ అయిన పరకాల యోగీంద్రులను / తిరుమంగై ఆళ్వారును శరణు పొందుతున్నాను.

శ్రీహరి శార్ఙ్గధనువు అంశాన తిరుమంగై ఆళ్వారులు నళనామ సంవత్సర కార్తికమాస శుద్ధపూర్ణిమ గురువారం కృత్తికానక్షత్రాన అవతరించారు. వీరిది ఖడ్గముద్ర. వీరిజన్మస్థలం చోళమండలంలోని కావేరీనదీ తీరాన తిరుక్కురైయలూరు అనే గ్రామం. ఇతడు చతుర్విధ కవితా విశారదుడు కూడ. వీరి జీవితకాలం 105 సంవత్సరాలు. వీరు –1 పెరియ తిరుమొళి (1084 పాశురాలు), 2. తిరుక్కురుందాండకమ్ (30 పాశురాలు), 3. తిరునెడుందాండకమ్ (30 పాశురాలు), 4. తిరువెళుక్కూత్తిరుక్కై (1.పాశురం), 5. శిరియతిరుమడల్ (148 1/2 పాశురాలు), 6. పెరియ తిరుమడల్ (77 1/2 పాశురాలు) అనుగ్రహించారు. వీరు ఆరు దివ్యప్రబంధాలను, చతుర్విధ కవితలను రచించారు, కనుక వీరికి షట్ప్రబంధ కృతికర్త,

చతుష్కవిశిఖామణి అని పేర్లు, ఇతడు చిత్రకవితావిశారదుడు కూడ, వీరు రథబంధాన్ని రచించిన మొట్ట మొదటి కవి.

తిరుమంగయాళ్వారు చోళమండలంలో కావేరీనది ఒడ్డున ఉండే తిరుక్కురైయలూరు అనే గ్రామంలో పుట్టాడు. ఈ గ్రామం తిరువాలి, తిరునగరికి సమీపాన ఉంది. తిరుమంగయాళ్వారుకు పరకాలయోగి అని కూడా వ్యవహారం, వీరికి తలిదండ్రులు పెట్టిన పేరు నీలుడు. వీరితండ్రిపేరుకూడ నీలుడే. వీరు చతుర్థకులజులు, శబరజాతివారు.

నీలుడు (పరకాలుడు) చిన్నతనమందే కులక్రమాగతమైన ధనుర్విద్య, మల్లయుద్ధం, అశ్వారోహణం, గజారోహణం మొదలయిన వాటిలో ఆరితేరిన వాడు. ఒకపర్యాయం నీలుడు (పరకాలుడు) తమదేశాన్ని పాలించే మహారాజును దర్శిస్తాడు.

రాజుగారు నీలుని వీరరసావతారాకృతిని, భీకరాటోపరూపాన్ని చూసి ఆకర్షితుడౌతాడు. అతడిని అసహాయ శూరునిగా భావించి పరకాలుడు అనే పేరు పెడతాడు. పరకాలుని మరోరాజుగారు తనకొలువులో ప్రముఖ ఉద్యోగిగా నియమించుకున్నాడు. రాజ్యరక్షకునిగా పరకాలునికి ఒక చిన్న దేశాన్ని ఇచ్చి పాలించుకొమ్మని అనుగ్రహించాడు. అలా నీలుడు పరకాలనామధేయునిగా మారి తమ మహారాజుగారికి సామంతుడుగా కప్పం చెల్లిస్తూ కొంతకాలం జీవనం సాగించాడు.

అది తిరువాళిత్తిరునాడు అనే ప్రాంతం, అక్కడ అందమైన తోటలు, సరస్సులు ఎక్కువ. అక్కడకు అప్సరసలు కూడ వచ్చి జలకేళి, పుష్పాపచయం చేసేవారు. ఒకసారి అప్సరసలు అక్కడకు వచ్చి విహరించి వెళ్లిపోయారు, అయితే వారిలో ఒక యుక్తవయసు బాలికారత్నం మాత్రం వెనుకబడి వారితో కలిసి వెళ్లలేకపోయింది.



అక్కడకు అనుకోకుండ తిరుణాంగనూరు అనే ప్రాంతంనుంచి భాగవతోత్తముడయిన ఒక వైద్యుడు వస్తాడు. ఆయన అక్కడ ఒంటరిగా ఉన్న బాలికామణిని చూసి ఆమె వివరాలు తెలుసుకుంటాడు. ఆ బాలికను ఆ భాగవతోత్తముడు తన ఇంటికి తోడ్కొని వెళ్తాడు. ఆ భాగవతోత్తముడు సంతానం లేని తమకు ఆ బాలికామణిని కూతురుగా భావించి, తన భార్యకు అప్పగిస్తాడు. బాలికామణికి ఆ దంపతులు కుముదవల్లి అని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచుకుంటుంటారు. ఆబాలికామణి యౌవన సౌందర్యంతో అభివృద్ధిచెందుతూ ఉంటుంది.

కుముదవల్లి సౌందర్యాన్ని, సుగుణాలను గురించి కొందరు పరకాలునకు విన్నవిస్తారు. పరకాలుడు తిరుణాంగునూరుకు వెళ్లి భాగవతోత్తముడయిన వైద్యవరిష్ఠుని గృహానికి వెళ్తాడు. అక్కడ కుముదవల్లిని తాను పరిణయమాడతానని విన్నవిస్తాడు.

**తాపః పుండ్ర స్తథా నామ మంత్రో యాగ శ్చ పంచమః,**
**అమీ పరమసంస్కారాః పారమైకాంత్యహేతవః.**

భావం- తాపం (చక్రాంకనం), ఊర్ధ్వపుండ్రం, దాస్యనామం, మంత్రం, తిరువారాధనం - ఈ ఐదు శ్రీవైష్ణవసిద్ధికి ముఖ్యాతిముఖ్యమైన సంస్కారాలు.

పంచసంస్కార సంపన్నుడు అయిన వానిని తప్ప తాను ఇతరునికి భార్యను కాజాలనని కుముదవల్లి విన్నవిస్తుంది.

పరకాలుడు వెంటనే తన నగరుకు వెళ్లి పరమకృపావలంబి అయిన ఒకనంబికి దండప్రణామాలు చేసి, వారితో పంచసంస్కారాలు పొందుతాడు.

పరకాలుడు కుముదవల్లికి తాను పంచసంస్కారాలు పొందినట్లు తెలుపడానికి వెళ్తాడు. పంచసంస్కార సంపన్నుడు, ద్వాదశోర్ధ్వ పుండ్రాలతో భాసించేవాడు అయిన పరకాలుని చూసి కుముదవల్లి సంతోషిస్తుంది.

పరకాలునితో కుముదవల్లి "మీరు ఒకసంవత్సరంపాటు నిరంతరాయంగా అష్టోత్తరశతసహస్ర (1008) శ్రీవైష్ణవసమారాధనం చేసి, తదీయ శ్రీపాద తీర్థాన్నీ, తళియ ప్రసాదాన్నీ స్వీకరిస్తానని శపథం చేస్తే మిమ్ములను భర్తగా స్వీకరిస్తాను" అని విన్నవిస్తుంది.

పరకాలుడు కుముదవల్లి చెప్పినట్లుగానే సంవత్సరంపాటు శ్రీవైష్ణవసమారాధనం చేయడానికి అంగీకరించి శపథం చేస్తాడు. కుముదవల్లి పెంపుడు తలిదండ్రులు ఎంతగానో సంతోషిస్తారు, తమ కన్యారత్నం కుముదవల్లిని పరకాలునకు దానం చేసి, కల్యాణోత్సవం చేస్తారు. పరకాలుడు కుముదవల్లీ సమేతంగా తన నివాసానికి చేరుకుంటాడు.

**ఆరాధనానాం సర్వేషాం విష్ణో రారాధనం పరమ్,**
**తస్మా త్పరతరం ప్రోక్తం తదీయారాధనం సదా.**

ఆరాధనలందు భగవదారాధనం ముఖ్యం, అంతకన్న తదీయారాధన (భాగవతులసమారాధనం) ముఖ్యం, కనుక పరకాలుడు ప్రతినిత్యం తనకు కలిగిన ధనంతో భాగవతుల సమారాధనం చేయాలని నిశ్చయించుకొని అలాగే చేస్తుంటాడు.

చోళభూపాలుని చారులు పరకాలుని నిర్ణయాన్ని తెలుసుకొని మహారాజుగారితో తమ సామంతుడయిన పరకాలుడు ధనాన్నంతా శ్రీవైష్ణవ సమారాధనకు వినియోగిస్తున్నాడని తెలుపుతారు.

చోళరాజు పరకాలుని దగ్గర కప్పం వసూలు చేసుకుని రండని కొందరిని పంపిస్తాడు. పరకాలుడు రేపు మాపు అని వ్యవధిని అడుగుతూ ద్రవ్యం మాత్రం భాగవతసమారాధనకే వినియోగిస్తుంటాడు, కానీ కప్పం చెల్లించలేకపోతాడు. అపుడు భృత్యులు చోళరాజుకు ఈవిషయాన్ని తెలుపుతారు. తుదకు కప్పం కోసం చోళరాజసైన్యానికి పరకాలుని సైన్యానికీ యుద్ధం జరుగుతుంది.



చోళుడు మహారాజు, పరకాలుడు సామంతుడు, కనుక పరకాలుని సైన్యం తక్కువగానే ఉంటుంది. చిట్టచివరకు పరకాలుడు స్వయంగా రణభూమికి వస్తాడు. పరకాలుని పరాక్రమధాటికి చోళ భూపాలుని సైన్యం పలాయనం చిత్తగించింది. చోళ భూపాలుడు కూడా స్వయంగా కదనరంగానికి వస్తాడు. పరకాలుని పరాక్రమాన్నీ దివ్యాకృతినీ చూసి చోళరాజు "పరకాలా! నీ శౌర్య ధైర్య సద్గుణాలు సన్నుతించ దగినవి. తిరిగి నీసామంతరాజ్యాన్ని నీవే ఏలుకో, నీవు లోకోపకారార్థం నారాయణునిఅంశతో ఉదయించిన భవ్యమూర్తివి" అని కీర్తిస్తాడు. పరకాలుడు కూడా మహారాజుతో "రాజా! నీవు కూడా ధార్మికుడవు. మహోదారుడవు. నేను స్వదేహ, స్వదేశ రక్షణకై నీతో యుద్ధం చేశాను కానీ, నీకు ప్రతిపక్షిగా మాత్రం కాదు" అంటాడు. కప్పం కట్టడానికి పరకాలుడు ఆమోదిస్తాడు. యుద్ధం ఆగిపోతుంది. చోళరాజు కప్పం వసూలు చేయడానికి ఒక మంత్రిని పరకాలుని దగ్గర ఉంచి వెళ్తాడు.

పరకాలుడు తనరాజధానికి వెళ్తాడు. భాగవతసమారాధనలో ధనమంతా అయి పోయింది, ధనశూన్య గృహం, పరకాలుడు రాజుగారికి అతని మంత్రితో కప్పం పంపించవలసి ఉంది.

ఒక రోజు రాత్రి పరకాలునకు నిద్రలో కరిగిరి వరదుడు కనబడతాడు. "వేగవతీనదీతీరాన పెన్నిధి ఉంది, దానిని తవ్వి తీసుకుని చోళరాజుకు కప్పం చెల్లించు'' అని కంచివరదరాజస్వామివారు పరకాలునికి చెప్పి, అదృశ్యమౌతారు. పరకాలుడు తనకు స్వప్నంలో కంచివరదులు చెప్పిన గుర్తులమేరకు వెళ్లి, పెన్నిధిని సంపాదిస్తాడు. చోళరాజుకు కప్పం చెల్లిస్తాడు. మిగిలిన ధనంతో తదీయారాధనం కొనసాగిస్తాడు. చోళరాజు పరకాలుని నీతికి భాగవతసమారాధనకు మెచ్చుకొని అతడు చెల్లించిన కప్పాన్ని తిరిగి ఇస్తాడు.

ఒకరోజు పరకాలుడు తనభార్య కుముదవల్లితో – "రాజుగారికి సామంతుడుగా ఉండడంవల్ల లభించిన ద్రవ్యంతో తదీయారాధనం చేయడం

కంటే, పశ్యతోహరవృత్తి (దొంగతనం చేయడం) వల్ల లభించిన ధనంతో భాగవత సమారాధనం బాగుగా చేయవచ్చుకదా!" అంటాడు. అందుకు కుముదవల్లి కూడా ఔను అని అంగీకరిస్తుంది. పరకాలుడు సపరివారంగా అడవులలో కాపు కాస్తూ వైష్ణవులు కానివారిని నిర్బంధించి దోచుకోవడం ప్రారంభిస్తాడు.

ఒకనాడు రాత్రిపూట పరకాలుడు వీధులలో తిరుగుతూ ఒక వైష్ణవుల ఇంటివాకిట్లో నిలబడ్డాడు. అది వైష్ణవుల ఇల్లని అతడు (రాత్రికనుక) గుర్తించలేక పోయాడు. ఆ ఇంటి ఇల్లాలు అపుడు బంగారు పాత్ర కడుగుతూ ఉంటుంది. పరకాలుడు ఆ పాత్రను లాగుకుంటాడు. ఆఇల్లాలు అపుడు "అస్మద్గురుభ్యో నమః" అంటుంది, వెంటనే పరకాలుడు ఆ బంగారుపాత్రను ఆ ఇంటిగడపపై ఉంచి దూరంగా నిలబడతాడు. ఆసంగతిని ఆఇల్లాలు తనభర్తకు తెలియజేస్తుంది. అతడన్నీ వివరంగా విని అస్మద్గురుభ్యో నమః అనే వాక్యం వినగానే పాత్రనువదలి దూరంగా ఉన్నవాడు పరకాలుడే కావచ్చని ఆ ఇంటి యజమానియగు వైష్ణవుడు తెలుపుతాడు. ఆయజమాని మాట విని పరకాలుడు ఆదంపతుల దగ్గరకు వచ్చి తనఅపరాధాన్ని క్షమించమని వేడుకుంటాడు. ఆవైష్ణవదంపతులు పరకాలుని తగురీతిలో సత్కరించి పంపిస్తారు.

పరకాలుడు తదీయారాధన చేసేందుకు పగటిపూట ధనంకోసం అడవిలో బాటసారులను దోచుకుంటూ, రాత్రి పూట (వైష్ణవేతర) ధనవంతుల ఇండ్లలో దొంగతనం చేస్తుంటాడు. ఇలా కాలం గడుస్తూ ఉంటుంది.

ఒక రోజు పరకాలునికి ధనం ఏమాత్రం లభించదు. అడవిదారులలో ఎవరైనా వస్తున్నారేమో అని చెట్టెక్కి నలుదిశలా చూశాడు, పరకాలుని కటాక్షించేందుకు ఇదే సరైన సమయమని శ్రీమన్నారాయణుడు ఒక ప్రణాళికను వేసుకుంటాడు. తాను పెళ్లికొడుకుగా, లక్ష్మీదేవి పెళ్లికూతురుగా, బ్రహ్మ పురోహితుడుగా, దేవతలు పరివారజనంగా వెంటరాగా, బంగారుపల్లకిలో అడవిలో వస్తాడు. వారిని చూచి రొట్టె విరిగి నేతిలో పడ్డట్లు సంతోషిస్తాడు



పరకాలుడు. అతడు పెండ్లి గుంపుపై పడి వారి సర్వాభరణాలు దోచుకుంటాడు, పెళ్లికొడుకు దగ్గరకు వెళ్లి అతనిఅంగులీయాన్ని పళ్లతో పట్టుకుని లాగుతుంటాడు. పెళ్లి కొడుకు 'కలియునో' అంటాడు. ఈ పదమే పరకాలునికి నిరూపకనామమై విరాజిల్లుతుంది, పరకాలుడు తాను దోచుకున్న ధనాన్ని పెట్టెలకు నింపుకొని ఉంటాడు. ఆపెట్టెలను తీసుక వెళ్లడానికి పరివారంతో కలిసి ప్రయత్నిస్తాడు. అయితే ఆ పెట్టెలు కొంచెం కూడా కదలవు. అపుడు పరకాలుడు పురోహితుని (బ్రహ్మను) చూసి, "ఇది నీ మంత్రమహిమనా" అంటాడు. పురోహితుడు పరకాలునితో "పెండ్లి కొడుకే మంత్రవాదకుశలుడు" అంటాడు. అపుడు పరకాలునితో పెండ్లికొడుకు (నారాయణుడు) "నేనే ఈద్రవ్యరాశులు గల పెట్టెలను కదలకుండ మంత్రించాను. వాటిని కదలించడానికి శక్తినిచ్చే మంత్రాన్ని ఉపదేశిస్తాను" అంటాడు. ఆపెండ్లికొడుకు (శ్రీమన్నారాయణుడు) పరకాలుని కుడిచెవిలో అష్టాక్షరీమంత్రాన్ని ఉపదేశిస్తాడు, తనదివ్యస్వరూపదర్శనం కూడా అనుగ్రహిస్తాడు.

శ్రీమన్నారాయణ దర్శనంతో తిరుమంగైయాళ్వారుకు తన్మయత్వంతో, కూడిన భక్తిలో కవనసుధాప్రవాహం పొంగి ప్రవహిస్తుంది, ఆరచనలే షట్ప్రబంధాలు (ఈవ్యాసప్రారంభంలో వీటిపేర్లు ఉన్నాయి). వీటిని అనుగ్రహించిన తర్వాత తిరుమంగయాళ్వారు చతుష్కవిశిఖామణిగా ప్రసిద్ధిని పొందుతాడు. దివ్యదేశాలన్నీ సందర్శిస్తాడు.

పరకాలయోగి ప్రతివాదులగు కవులను ఓడిస్తాడు. విజయకాహళ శంఖారావాల మధ్యన స్వకీయబిరుదాల స్తోత్రపాఠాలతో ఊరేగింపులు జరుగుతాయి తిరుమంగయాళ్వారుకు.

శ్రీరంగనాథులవారి దివ్యవిమానమంటప గోపురప్రాకారాదుల నిర్మాణానికి ధనం ఎలా సంపాదించాలో పరిజనాలతో ఆలోచిస్తాడు పరకాల యోగి. నాగపట్టణంలో ఒకపెద్దలోహవిగ్రహం ఉందనీ, దానిని పెకలిస్తే

కావలసినంత బంగారం లభిస్తుందనీ సమాచారం అందుతుంది పరకాలయోగికి. అపుడు తిరుమంగయాళ్వారు ఆవిగ్రహాన్ని పెకలించి బంగారును సమకూర్చుకుంటారు. శ్రీరంగంలో తను అనుకున్న నిర్మాణాలన్నీ పూర్తి చేస్తాడు పరకాలుడు. ఈవిషయంలో సహకరించినశిల్పులకు అశాశ్వతమైన ధనానికి బదులు శాశ్వతమైన మోక్షాన్ని ప్రసాదిస్తాడు.

జీవితం చాలించదలచిన తిరుమంగయాళ్వారులు కుముదవల్లి తోపాటు భద్రాశ్రమంలో భద్రాసనస్థుడై యోగమార్గంలో శ్రీమన్నారాయణుని సాక్షాత్కరింపజేసుకుని నిజస్వరూపాన్ని (శ్రీహరిశార్ఙ్గ ధనువు రూపం) పొందుతాడు.

తిరుమంగయాళ్వారు తాము అనుగ్రహించిన దివ్యప్రబంధాలలో మంగళాశాసనంచేసిన దివ్యదేశములు –

1. తిరుప్పిరిది, 2. బదరికాశ్రమం, 3. సాలగ్రామం, 4. నైమిశారణ్యం, 5. శింగవేల్ కున్రమ్, 6. తిరువెంగడం, 7. తిరువెవ్వుళూర్, 8. తిరునీర్మలై, 9. తిరువల్లిక్కేణి, 10. తిరుక్కడల్మల్లై, 11. తిరువిడవెన్దై, 12. తిరుఅష్ట భుజం, 13. పరమేశ్వర విణ్ణగరమ్, 14. తిరుక్కోవలూర్, 15. తిరువహీంద్రపురం, 16. తిరుచ్చిత్తిరకూడం, 17. కాంచీరామ విణ్ణగరం, 18. తిరువాలి, 19. మణిమాడక్కోయిల్, 20. వైకున్దవిణ్ణగరం, 21. ఆరిమేయవిణ్ణగరం, 22. తిరుత్తేవనార్ తొగై, 23. వణ్పురుడోత్తం, 24. శెమ్బొన్ శెయ్‌కోయిల్, 25. తిరుతెత్తియమ్బలం, 26. తిరుమణిక్కూడం, 27. తిరుక్కావళంబాడి, 28. పార్తన్‌పల్లి, 29. తిరువెళ్లక్కుళం, 30. తిరువిన్దళూర్, 31. తిరువెళ్లియంగుడి, 32. పుళ్లమ్బూదంగుడి, 33. తిరుక్కూడలూర్, 34. తిరువెళ్లరై, 35. తిరువరంగం, 36. తిరుప్పేర్‌నగర్, 37. నన్దిపుర విణ్ణగరం 38. తిరువిణ్ణగర్, 39. తిరునరయూర్, 40. తిరుచ్చేరై, 41. తిరువళున్దూర్, 42. శిరుపులియూర్, 43. తిరుక్కణ్ణమంగై, 44. తిరుక్కణ్ణపురం, 45. తిరుక్కణ్ణంగుడి, 46. తిరునాగై, 47. తిరుప్పుల్లాణి, 48. తిరుక్కురుంగుడి, 49. తిరువల్లవాళ్, 50. తిరుమాలిరుంజోలైమలై, 51. తిరుక్కోట్టియూర్.



**తిరుమంగయాళ్వారు దివ్యతిరువడిగళే శరణం.**

## 11. నమ్మాళ్వారు (శఠకోపయోగి)

**ఆదౌ కలే ర్ద్వి కురుకాపురి పాండ్యదేశే**
**వైశాఖమాసి మఘువానలభే ऽంశజాతమ్,**
**సేనాపతేః పదజకారిగృహే ऽ వతీర్ణం**
**శ్రీశాస్పదం శఠరిపుం శరణం ప్రపద్యే.**

భావం– పాండ్యదేశాన ఉన్న కురుకాపట్టణంలో కలియుగారంభాన వైశాఖ – విశాఖానక్షత్రాన, విష్వక్సేనుల అంశతో శూద్రుడయిన కారి గృహంలో జన్మించినవాడు అయిన భగవంతునికి అభీష్టస్థానమైన శఠకోపసూరిని శరణుజొచ్చెద.

శ్రీహరి సర్వసైన్యాధ్యక్షులయిన విష్వక్సేనాంశాన నమ్మాళ్వారు అవతరించారు. పాండ్య మండలంలో తామ్రపర్ణీ నదీతీరాన ఉన్న ఆళ్వార్ తిరునగరి / కురుకాపురి / తిరుక్కురుగూర్ / కురంగనగరం / శ్రీపురి వీరి జన్మస్థలం. అక్కడ వెలసిన ఆదినాథప్పెరుమాళ్ కృపతో శఠకోపయోగి (నమ్మాళ్వారు) జన్మించారు. వీరిది వ్యాఖ్యానముద్ర. ప్రమాధి నామసంవత్సర (బహుధాన్య అని కొందరు) వృషభం (వైశాఖమాస) శుక్ల పక్ష చతుర్దశి విశాఖానక్షత్రం కటకలగ్నం శుక్రవారంనాడు శఠకోపులవారు జన్మించారు. వీరు రచించిన దివ్యప్రబంధాలు – తిరువిరుత్తం (100 పాశురాలు), 2. పెరియ తిరువన్దాది (7 పాశురాలు), 3. తిరువాయి మొళి (1102 పాశురాలు. వీరి జీవితకాలం 35 సంవత్సరాలని పెద్దలమాట.

నమ్మాళ్వారు తండ్రి శూద్ర కులజులైన'కారి'. ఇతడు తిరువాళ్‌మార్బరు అనే శ్రీవైష్ణవోత్తముని కూతురయిన ఉడయ నంగయార్ / నాథనాయికను పెండ్లాడాడు. నమ్మాళ్వారు తల్లి నాథనాయిక.

నమ్మాళ్వారుకు అష్టోత్తరశతనామావళి ఉంది. వాటిలో బాగా ప్రచారంలో ఉన్న నామాలు – కారిమారులు, కారిసూనులు, మారన్, శఠకోపులు, పరాంకుశులు, కురుకేశ, కురుకాధిప, కురుక్కైపిరాన్, తిరుక్కురుగూర్‌నంబి, ఆరుళ్‌మారన్, వకుళాభరణులు.

నమ్మాళ్వారు జన్మించడానికి ముందే ముందుచూపుతో వీరిని రక్షించడానికి ఆదిశేషులవారు తిరునగరిలో చింతచెట్టు రూపంలో ఉంటారు.

కారి – నాథనాయికలకు నమ్మాళ్వారు శిశువుగ పుట్టినపుడు ఏడవలేదు, కన్నులు తెరువలేదు, చనుబాలు తాగలేదు, కేవలం పడుకొని ఉండినాడు. అయినా కూడ పరాంకుశులవారి ముఖం వాడిపోలేదు, చిక్కి పోలేదు. మీదు మిక్కిలి విష్ణువిన్యస్త భరుడై శుక్లపక్ష చంద్రునిలా దినదినాభి వృద్ధిని పొందుతూ ఉన్నాడు. ఇలా పద్దెనిమిది రోజులు గడిచాయి. తలిదండ్రులు నమ్మాళ్వారును ఆదినాథ పెరుమాళ్ ఆజ్ఞతో అక్కడ ఉండే చింత చెట్టు మూలప్రదేశాన తొట్టి (ఊయల) ఏర్పాటు చేసి అందులో శిశువును పడుకోబెట్టి పుత్రప్రేమను వదులుకొని వెళ్లిపోతారు. ఇలా ఏడాదికాలం జరుగుతుంది. అప్పుడు కారి, నాథనాయికలు నమ్మాళ్వారును చూడడానికి అక్కడకు వస్తారు. వారి రాకను గమనించిన ఆ శిశువు ఊయల నుండి దిగి ఆడుకుంటూ అక్కడి చింత చెట్టు తొర్రలోనికి చొచ్చుకొని వెళ్లిపోతుంది. ఆ తర్వాత పదునాలుగు సంవత్సరాలు గడచిపోతాయి.

మధురకవి అనేవారు ఉత్తరభారతదేశంలోని దివ్యతిరుపతుల యాత్రలను చేస్తుంటారు (మధురకవి ఆళ్వారు పన్నిద్దరు ఆళ్వారులలో ఒకరు, వీరు నమ్మాళ్వారు సమకాలీనులు. వీరిని గురించి తరువాతిపుటలలో చూడవచ్చు) మధురకవివారు బదరీక్షేత్రాన్ని సేవించుకొని అయోధ్యకు



చేరుకుంటారు. వారు అయోధ్యలో ఉన్నపుడు ఒక రాత్రి వారికి దక్షిణ దిశలో సూర్యమండలం కనిపిస్తుంది. వరుసగా నాలుగు రాత్రులు అలాగే కనిపిస్తుంది. ఆవిచిత్రవిశేషాలను తెలుసుకుంటారు మధురకవులు. ఆకాంతి నమ్మాళ్వారులదిగా అక్కడివారు చెప్పారు. వెంటనే మధురకవి దక్షిణదేశానికి తన ప్రయాణాన్ని సాగిస్తాడు. అలా ప్రయాణం సాగిస్తూ మధురకవి శ్రీరంగం చేరుకుని, అక్కడినుంచి శ్రీపురి (కురుకానగరికి) చేరుకుంటాడు. స్థానికులను కలుసుకొని అక్కడివిశేషాలు తెలుసుకుంటాడు. నమ్మాళ్వారును గురించి తెలుస్తుంది. వారిని దర్శించుకోవాలనే ఉద్దేశంతో తింత్రిణీవృక్షం (చింత చెట్టు) దగ్గరకు వెళ్తాడు. ఆచెట్టుతొర్రలో పద్మాసనాసనస్థుడై వ్యాఖ్యానముద్రలో ఉన్న వకుళ భూషణసూరిని (నమ్మాళ్వారును) దర్శిస్తాడు.

నమ్మాళ్వారును మేల్కొల్పడానికి మధురకవులు కరతాళధ్వని చేస్తారు. మధురకవిని కటాక్షించాలని నమ్మాళ్వారు కనులు తెరుస్తాడు. మధురకవి మహానందభరితుడవుతాడు. తనను కనికరించవలసిందని మధురకవి నమ్మాళ్వారులకు సాష్టాంగ దండప్రణామాలు చేస్తాడు. మధురకవికి కలిగిన సంశయాలను నమ్మాళ్వారులు తీరుస్తాడు.

భగవన్నామంకంటే తన గురువైన నమ్మాళ్వారు నామమే గొప్పదనే భావంతో 'కణ్ణినున్ శిరుత్తాంబు' అనే స్వీయ రచిత దివ్యప్రబంధాన్ని గానంచేస్తాడు. నమ్మాళ్వారు మధురకవికి పంచసంస్కారాలను చేసి తత్త్వోపదేశం కూడా చేస్తాడు.

శ్రీమన్నారాయణుడు లక్ష్మీసమేతంగా గరుడారూఢుడై నమ్మాళ్వారు వారికి సాక్షాత్కరిస్తాడు. పరాంకుశమునులు (నమ్మాళ్వారు) భగవద్గుణానుభావ జనితమైన వాక్ప్రవాహంతో నాలుగు దివ్య ప్రబంధాలను ఆనతిస్తారు. వాటిలో "తిరువిరుత్తం" ఋగ్వేదసార భూతమైంది, "శిరువాశిరియం" యజుర్వేదసారం, "పెరియ తిరువన్దాది" అధర్వణవేదసారం, ఇక ద్రావిడవేదం అనబడే

"తిరువాయ్‌మొళి" చరమప్రబంధం, సామవేదసారమైనది. నమ్మాళ్వారు వీటిని మధురకవికి అర్థానుభవ పూర్వకంగా ఉపదేశిస్తాడు.

తిరునగరిలో పుష్పమంటపం, త్యాగమంటపం, భోగమంటపాలలో గల భగవన్మూర్తులు, సకలదివ్యదేశాలలోని అర్చామూర్తులు పరాంకుశుల కవితాసంపదకు ఆకర్షితులై మంగళాశాసనం చేస్తారు. వారందరూ శఠకోపసూరికి 'నమ్మాళ్వారు' అనే సార్థకనామాన్ని అనుగ్రహిస్తారు. 'నమ్ - ఆళ్వారు అంటే మా - ఆళ్వారు' అని అర్థం.

నమ్మాళ్వారు ప్రపన్నజనకూటస్థులై పరమభక్తిభావసంపన్ను లవుతారు. వీరు తన ముప్పది అయిదవ ఏట అర్చారూపం ధరిస్తానని తన ప్రియ శిష్యులయిన మధురకవులకు తెలుపుతారు. మధురకవులు చాలా సంతోషించి తింత్రిణీవృక్ష సమీపాన అర్చారూపంగా వకుళాభరణులవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు.

ఆళ్వారులందరూ శరీరం కాగా నమ్మాళ్వారు శరీరి. ఆళ్వార్ల దివ్యప్రబంధాలన్నీ అవయవాలు కాగా వీరి "తిరువాయ్‌మొళి" అవయవి. తిరువాయ్‌మొళిని అనుసంధించినవారికి వైకుంఠప్రాప్తి కలుగుతుంది.

నమ్మాళ్వారు అనుగ్రహించిన దివ్యప్రబంధాలలో మంగళాశాసనం చేసిన దివ్యతిరుపతులు -

1. తిరుమాలిరుంజోలై మలై, 2. తిరువేంగడం, 3. తిరుక్కురుగూర్, 4. తిరుక్కురుంగుడి, 5. శ్రీవరమంగై, 6. తిరుక్కుడంద్దై, 7. తిరువల్లవాళ్, 8. తిరువణ్‌వణ్డూర్, 9. తిరువిణ్ణగర్, 10. తొలైవిల్లి మంగలం, 11. తిరుక్కోళూర్, 12. తిరువరంగం, 13. తెన్ తిరుప్పేరై, 14. తిరువారన్ విళై, 15. తిరుచ్చెంగునూర్, 16. తిరుక్కడిత్తానం, 17. తిరుప్పులియూర్, 18. తిరుప్పుళింగుడి, 19. తిరుక్కాట్కరై, 20. తిరుమూళిక్కళం, 21. తిరునావాయ్, 22. తిరుక్కణ్ణపురం, 23. తిరువెూగూర్, 24. తిరువనంతపురం, 25. తిరువాట్టారు, 26. తిరుప్పేర్‌నగర్, 27. శ్రీవైకుంఠం, 28. వరగుణమంగై, 29. తిరువణ్‌పరిశారం, 30. తిరుక్కుళంద్దై, 31. తిరుపాడగం, 32. తిరు ఊరగం, 33. తిరువెఃకా / యథోక్తకారి సన్నిధి, 34. తిరువయోద్ధ్యై, 35. ద్వారకై, 36. వడమధురై, 37. తిరుప్పార్‌కడల్, 38. పరమపదం.



**నమ్మాళ్వార్ దివ్యతిరువడిగళే శరణం.**

## 12. మధురకవి ఆళ్వారు

**అవిదితవిషయాంతర శ్శఠారే**
**రుపనిషదా ముపగానమాత్రభోగః,**
**అపి చ గుణవశా త్తదేకశేషీ**
**మధురకవిర్ హృదయే మ మావి రస్తు.**

భావం- శ్రీనమ్మాళ్వారులనే పరమదైవంగా భావించి, ఇతర విషయాలను తలచక వారి ద్రవిడవేదదివ్యసూక్తులనే నిత్యం గానం చేస్తూ పరమానంద భరితులై ఉండే శ్రీమధురకవి ఆళ్వారులను నాహృదయంలో ఎల్లప్పుడూ ధ్యానిస్తూ ఉంటాను.

శ్రీహరి కుముదగణేశాంశాన మధురకవి బ్రాహ్మణకులాన అవతరిస్తాడు. తామ్రపర్ణీతీరాన గల తిరుక్కోళూరు వీరిజన్మస్థలం. వీరు ఈశ్వరనామ సంవత్సర వైశాఖ శుద్ధ చతుర్దశి శుక్రవారం నాడు జన్మిస్తారు. వీరి ఆచార్యులు నమ్మాళ్వారు.

వీరు వయసులో నమ్మాళ్వారుకన్నా పెద్దవారు. అయితే వీరు వకుళాభరణులవారికి శిష్యులు. వీరిని గురించి 'నమ్మాళ్వారు' ను గురించిన శీర్షికలో తెలుసుకున్నాం. మరికొన్ని విషయాలు ప్రస్తుతం తెలుసుకుందాం.

మధురకవి ఆళ్వారు వకుళాభరణుల అర్చావిగ్రహాన్ని తిరునగరిలోని తింత్రిణీవృక్షమూలాన ప్రతిష్ఠిస్తారు. అక్కడ సంవత్సరం పొడుగునా ఉత్సవాలు జరుగుతుంటాయి. నమ్మాళ్వారు బిరుదాంకితగాథలను పొగడుతూ ఉత్సవాలలో విజయకాహళాదులు ఊదుతుంటారు, మోగిస్తుంటారు.

ఒక పర్యాయం అక్కడ ఉత్సవాలలో విజయకాహళశబ్దం విన్న కంబనాథుడు అనే ద్రవిడ కవీంద్రుని శిష్యుడొకరు దీనిని ఆక్షేపిస్తాడు. "మా గురువు కంబకవీంద్రుని జయిస్తేనే ఈ కాహళ ఊదాలి. లేకుంటే ఊదరాదు" అని అడ్డుకుంటాడు. అపుడు మధురకవి ఇలా చెప్పాడు "మాగురువు శఠకోపసూరి అర్చారూపి. ఈదివ్యదేశాన్ని వదలి బయటకు రాడు.  వారు ఆనతిచ్చిన ఒక సూక్తిని నీకు ఇస్తాను. దానిని మీ శంఖఫలకంలో ఉంచండి. ఫలకం ఈసూక్తిని వహిస్తే మాగురువు మీగురువును జయించినట్లు" అని చెప్పి, 'కణ్ణన్ కలవిన' అనే పాశురాన్ని ఒక పత్రంపై రాసి కంబకవి శిష్యునికి ఇస్తాడు మధురకవి.

కంబకవిశిష్యుడు ఆపత్రాన్ని తీసుకొని వెళ్లి తనగురువు కంబనాథునికి ఇస్తాడు. అతడు దానిని శంఖఫలకంపై ఉంచుతాడు. శంఖఫలకం నాగదేవతాధిష్ఠితం. నమ్మాళ్వారుల సూక్తి పత్రాన్ని మహోన్నతశంఖఫలకం వహిస్తుంది. అపుడు కంబకవి పరాంకుశ మునీంద్రుని స్తుతిస్తూ 'శఠకోప నూత్తందాది' అనే స్తోత్ర ప్రబంధాన్ని చెప్పారు.

మధురకవి పరాంకుశమునీంద్రుల ప్రభావాన్ని ప్రకాశితం కావించి, విభవరూపం చాలించి అర్చారూపం ధరిస్తారు.

**మధురకవిఆళ్వార్ దివ్యతిరువడిగళే శరణం.**



## నాలాయిర దివ్యప్రబంధసముద్ధరణ

మధురకవిశిష్యులకు శ్రీనాథమునులవారు సమకాలీనుడు. నాథమునులవారు మధురకవులు అనుగ్రహించిన దివ్య ప్రబంధం "కణ్ణినుణ్ శిరుత్తాంబు"ను తిరునగరిలో భక్తి శ్రద్ధలతో పారాయణం చేసి నమ్మాళ్వారులను ప్రత్యక్షం చేసుకుని వారి అనుగ్రహంతో ఖిలమైపోయిన నాలాయిర దివ్య ప్రబంధాన్ని సముద్ధరించారు.

**శ్రీదివ్యసూరిశ్రీచరణారవిందార్పణ మస్తు**

# అనుబంధం

## 1. ఆళ్వార్ల తిరునక్షత్రం, నిత్యతనియన్‌లు

### 1. పొయ్‌గై ఆళ్వారు

**తిరునక్షత్ర తనియన్ –**

కాంచ్యాం సరసి హేమాబ్జే జాతం కాసారయోగినమ్,
కలయే యః శ్రియఃపత్యు రరవింద మకల్పయత్.

**నిత్యతనియన్ –**

తులాయాం శ్రవణే జాతం కాంచ్యాం కాంచనవారిజాత్,
ద్వాపరే పాంచజన్యాంశం సరోయోగిన మాశ్రయే.

### 2. పూదత్తాళ్వారు

**తిరునక్షత్రతనియన్ –**

తులా శ్రవిష్ఠా సంభూతం భూతం కల్లోలయోగినమ్,
తీరే ఫుల్లోత్పలే మల్లపుర్యా మీడే గదాంశజమ్.

**నిత్యతనియన్ –**

మల్లాపురవరాధీశం మాధవీకుసుమోద్భవమ్,
భూతం నమామి విష్ణోః యో జ్ఞానదీప మకల్పయత్.

### 3. పేయాళ్వారు

**తిరునక్షత్ర తనియన్ –**

తులా శతభిషగ్జాతం మయూరపురికైరవాత్,
మహాంతం మహదాఖ్యాతం వందే శ్రీనందకాంశజమ్.

**నిత్యతనియన్ –**

దృష్ట్వా తుష్టావ యో విష్ణుం రమయా మయిలాధిపమ్,
కూపే రక్తోత్పలే జాతం మహదాహ్వాయ మాశ్రయే.



### 4. తిరుమళిశైయాళ్వారు

**తిరునక్షత్ర తనియన్ –**

మఖాయాం మకరే జాతం చక్రాంశం భార్గవోద్భవమ్,
మహీసారపురాధీశం భక్తిసార మహం భజే.

**నిత్యతనియన్–**

పంచశక్తిమయదివ్యవిగ్రహం
భక్తిమత్సుజనభూర్యనుగ్రహమ్
పాపచేతనమనో ఽతిదుర్గ్రహం
భక్తిసార ముని మాశ్రయే ఽన్వహమ్.

### 5. కులశేఖరాళ్వారు

**తిరునక్షత్ర తనియన్ –**

కుంభే పునర్వసౌ జాతం కేరళే కోళిపట్టణే,
కౌస్తుభాంశం ధరాధీశం కులశేఖర మాశ్రయే.

**నిత్యతనియన్–**

ఘుష్యతే యస్య నగరే రంగయాత్రా దినే దినే
త మహం శిరసా వందే రాజానం కులశేఖరమ్.

### 6. పెరియాళ్వారు

**తిరునక్షత్ర తనియన్ –**

మిథునే స్వాతిజం విష్ణోః రథాంశం ధన్వినః పురే,
ప్రపద్యే శ్వశురం విష్ణో ర్విష్ణుచిత్తం పురశ్శిఖమ్.

**నిత్య తనియన్ –**

గురుముఖ మనధీత్య ప్రాహ వేదా నశేషాన్
నరపతిపరిక్లుప్తం శుల్క మాదాతుకామః
శ్వశుర మమరవంద్యం రంగనాథస్య సాక్షాత్
ద్విజకులతిలకం తం విష్ణుచిత్తం నమామి.

## 7. ఆండాళ్

**తిరునక్షత్ర తనియన్ –**

కర్కటే పూర్వఫల్గుణ్యాం తులసీకాననోద్భవామ్,
పాండ్యే విశ్వంభరాం గోదాం వందే శ్రీరంగనాయకీమ్.

**నిత్యతనియన్ –**

నీలాతుంగస్తనగిరితటీసుప్త ముద్బోధ్య కృష్ణం
పారార్థ్యం స్వం శ్రుతిశతశిరస్సిద్ధ మధ్యాపయంతీ,
స్వోచ్ఛిష్టాయాం స్రజి నిగళితం యా బలాత్కృత్య భుంక్తే
గోదా తస్యై నమ ఇద మిదం భూయ ఏ వాస్తు భూయః.

## 8. తొండరడిప్పొడియాళ్వారు

**తిరునక్షత్ర తనియన్ –**

కోదండే జ్యేష్ఠనక్షత్రే మండంగుడిపురోద్భవమ్,
చోళోర్వ్యాం వనమాలాంశం భక్తపద్రేణు మాశ్రయే.

**నిత్యతనియన్ –**

త మేవ మత్వా పరవాసుదేవం
రంగేశయం రాజవ దర్హణీయమ్,
ప్రాబోధకీం యః కృతసూక్తిమాలాం
భక్తాంఘ్రిరేణుం భగవంత మీడే.



## 9. తిరుప్పాణాళ్వారు

**తిరునక్షత్ర తనియన్ –**

వృశ్చికే రోహిణీజాతం శ్రీపాణం నిచుళాపురే,
శ్రీవత్సాంకాం గాయకేంద్రం మునివాహన మాశ్రయే.

**నిత్య తనియన్ –**

ఆపాదచూడ మనుభూయ హరిం శయానం
మధ్యే కవేరదుహితు ర్ముదితాంతరాత్మా,
అద్రష్టుతాం నయనయో ర్విషయాంతరాణాం
యో నిశ్చకాయ మనవే మునివాహనం తమ్.

## 10. తిరుమంగయాళ్వారు

**తిరునక్షత్ర తనియన్ –**

కార్తికే కృత్తికాజాతం చతుష్కవిశిఖామణిమ్,
షట్ప్రబంధకృతం శార్ఙ్గమూర్తిం కలిహ మాశ్రయే.

**నిత్య తనియన్ –**

కలయామి కలిధ్వంసం కవిం లోకదివాకరమ్,
యస్య గోభిః ప్రదేశాభి రావిద్యం నిహతం తమః.

## 11. నమ్మాళ్వారు

**తిరునక్షత్ర తనియన్ –**

వృషభే తు విశాఖాయాం కురుకాపురికారిజమ్,
పాండ్యే దేశే కలే రాదౌ శఠారిం సైన్యపం భజే.

**నిత్యతనియన్ –**

మాతా పితా యువతయ స్తనయా విభూతి
స్సర్వం యదేవ నియమేన మదన్వయానామ్,

ఆద్యస్య నః కులపతే ర్వకుళాభిరామం
శ్రీమత్తదంఘ్రియుగళం ప్రణమామి మూర్ధ్నా,

**12. మధురకవియాళ్వారు**

**తిరునక్షత్ర తనియన్ -**

చైత్రే చిత్తాసముద్భూతం పాండ్యదేశే గణాంశజమ్,
శ్రీపరాంకుశసద్భక్తం మధురం కవి మాశ్రయే.

**నిత్య తనియన్ -**

హస్తస్థతాళద్వితయం ప్రపద్యే
శఠారివాగ్వ్యాస ముదారకీర్తిమ్,
మాధుర్యసంశ్లిష్టకవిత్వయుక్తం
మహత్త్వసంభావితభక్తితత్త్వమ్.

## 2. పన్నిద్దరాళ్వారులు - సంక్షిప్త పరిచయ సూచిక

| క్రమ సంఖ్య | ఆళ్వారు | అంశ | తలిదండ్రులు | పుట్టినరోజు మాసం-నక్షత్రం | జన్మస్థలం | ముద్ర |
|---|---|---|---|---|---|---|
| 1. | పొయ్‌గయ్ ఆళ్వారు | పాంచజన్య | బంగారుపద్మంలో పుట్టారు | తుల-శ్రవణ | కాంచీపురం | జ్ఞాన |
| 2. | పూదత్తాళ్వారు | కౌమోదకి | మాధవీకుసుమంలో పుట్టారు | తుల-ధనిష్ఠ | భూతపురి మల్లాపురం | బ్రహ్మ |
| 3. | పేయాళ్వారు | నందక | ఎర్రకలువలో పుట్టారు | తుల-శతభిష | మైలాపురి | అంజలి |
| 4. | తిరుమళిశై ఆళ్వారు | సుదర్శన | కన్నవారు భార్గవర్షి కనకాంగి పెంచినవారు తిరువాళరు పంకజచ్చొళ్లి(మేదర) | మకర-మఖ | తిరుమళిశై | అక్షమాల |
| 5 | కులశేఖర ఆళ్వారు | కౌస్తుభ | తండ్రి-దృఢవ్రత (చంద్రవంశక్షత్రియ) | కుంభ-పునర్వసు | తిరువాన్మూరు (కోళి) | అంజలి |
| 6. | పెరియాళ్వారు | గరుడ | ముకుందాచార్య పద్మావతమ్మ (పురచ్చుడభాహ్మణ) | మిథున-స్వాతి | శ్రీవిల్లిపుత్తూరు | ప్రపదన |
| 7. | ఆండాళ్ | భూదేవి | పెంపుడు తండ్రి పెరియాళ్వారు | కర్కాటక-పుబ్బ | శ్రీవిల్లిపుత్తూరు | శుక (చిలుక) |
| 8. | తిరుపాణాళ్వారు | శ్రీవత్స | వ్రీహిగుచ్ఛ సంభవులు పెంపుడు తండ్రి మాదదాసు(మాలవారు) | వృశ్చిక-రోహిణి | వరయూరు | వీణ |
| 9. | తిరుమంగై ఆళ్వారు | శార్‌ఙ్గ | తండ్రి-నీలుడు శబరజాతి | వృశ్చిక-కృత్తిక | తిరుక్కురై-యలూరు | ఖడ్గ |
| 10. | తొండరడిప్పొడి ఆళ్వారు | వనమాల | బ్రాహ్మణ | మార్గశీర్ష-జ్యేష్ఠ | మండంగుడి | పుష్పమాల |
| 11. | నమ్మాళ్వారు | విష్వక్సేన | కారి(తండ్రిపేరు) | వృషభ-విశాఖ | తిరునగరి | వ్యాఖ్యాన |
| 12. | మధురకవి ఆళ్వారు | విష్వక్సేన | తండ్రిపేరు-నారాయణ | మేష-చిత్త | తిరుక్కోళూరు | తాళ |

## 3. పన్నిద్దరాళ్వారులు అనుగ్రహించిన
## దివ్యప్రబంధాలు (పాశురసంఖ్యాసమేతం)

| | | | | |
|---|---|---|---|---|
| 1. | పొయ్‌గయ్ ఆళ్వార్ | 1. ముదల్‌తిరువన్దాది | 100 | పాశురాలు |
| 2. | పూదత్తాళ్వారు | 1. ఇరణ్డాం తిరువన్దాది | 100 | పాశురాలు |
| 3. | పేయాళ్వారు | 1. మూన్దాం తిరువన్దాది | 100 | పాశురాలు |
| 4. | తిరుమళిశైయాళ్వారు | 1. నాన్ముగం తిరువన్దాది | 96 | పాశురాలు |
| | | 2. తిరుచ్చంద విరుత్తం | 120 | పాశురాలు |
| 5. | కులశేఖరాళ్వారులు | 1. పెరుమాళ్‌తిరుమొళి | 105 | పాశురాలు |
| 6. | పెరియాళ్వారు | 1. తిరుప్పల్లాండు | 7 | పాశురాలు |
| | | 2. పెరియాళ్వార్ తిరుమొళి | 461 | పాశురాలు |
| 7. | ఆండాళ్ | 1. నాచ్చియార్ తిరుమొళి | 143 | పాశురాలు |
| | | 2. తిరుప్పావై | 30 | పాశురాలు |
| 8. | తొండరడిప్పొడి ఆళ్వారు | 1. తిరుమాలై | 45 | పాశురాలు |
| | | 2. తిరుప్పళ్ళియెళుచ్చి | 10 | పాశురాలు |
| 9. | తిరుప్పాణాళ్వారు | 1. అమలనాదిపిరాన్ | 10 | పాశురాలు |
| 10. | తిరుమంగయాళ్వారు | 1. పెరియ తిరుమొళి | 1084 | పాశురాలు |
| | | 2. తిరుక్కురున్దాండకం | 20 | పాశురాలు |
| | | 3. తిరునెడున్దాండకం | 30 | పాశురాలు |
| | | 4. తిరువెళిక్షూత్తుర్కై | 40+1 | పాశురాలు |
| | | 5. శిరియ తిరుమడల్ | 148½ | పాశురాలు |
| | | 6. పెరియ తిరుమడల్ | 78 | పాశురాలు |
| 11. | నమ్మాళ్వారు | 1. తిరువిరుత్తం | 100 | పాశురాలు |
| | | 2. తిరువాశిరియం | 7 | పాశురాలు |
| | | 3. పెరియ తిరువన్దాది | 87 | పాశురాలు |
| | | 4. తిరువాయిమొళి | 1102 | పాశురాలు |
| 12. | మధురకవి ఆళ్వార్ | 1. కణ్ణినున్ శిరుత్తాంబు | 11 | పాశురాలు |

పన్నిద్దరు ఆళ్వారుల దివ్య ప్రబంధాలు + (తిరువరంగత్తముదనారు అనుగ్రహించిన) రామానుజునూత్తందాది కలిసి మొత్తం 24+1=25 దివ్యప్రబంధాలను నాలాయిర దివ్య ప్రబంధం అంటారు. ద్రవిడవేదానికి పెరియాళ్వారు అనుగ్రహించిన తిరుప్పల్లాండు ప్రణవం. ఆళ్వారుల ప్రబంధాల పాశురాలు 4000+ రామానుజనూత్తందాది పాశురాలు 108 (కులశేఖరులవారు అనుగ్రహించిన ముకుందమాల సంస్కృత రచన)